ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
బుధవారం 2 ఏప్రిల్ 2025





ఒంటిమిట్ట కోదండరాముని ఆలయం

15 మంది ఎస్సైలు బదిలీ

కడప క్రైం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న 15 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారు తక్షణమే వారికి కేటాయించిన స్టేషన్లలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు.

ఎస్ఐ పేరు	ప్రస్తుతం	బదిలీ ప్రాంతం
హైమవతి	డీఎస్‌బీ, కడప	జమ్మలమడుగు
కల్పన	జమ్మలమడుగు	డీఎస్‌బీ, కడప
తులసీ నాగప్రసాద్	సింహాద్రిపురం	కడప తాలూకా
ప్రదీప్ నాయుడు	కడప తాలూకా	డీఎస్‌బీ, కడప
పెద్దఓబన్న	తొండూరు	వల్లూరు
అరుణ్ రెడ్డి	డీఎస్‌బీ, కడప	ప్రొద్దుటూరు రూరల్
మహ్మద్ రఫీ	కలమల్ల	సిద్దవటం
తిమ్మోతి	కలమల్ల	కలసపాడు
గణ మద్దిలేటి	కలసపాడు	తొండూరు
జయరాయులు	కడప రిమ్స్	కలమల్ల
మల్లికార్జునరెడ్డి	డీఎస్‌బీ, కడప	కడప వన్‌టౌన్
రవికుమార్	బద్వేలు	సింహాద్రిపురం
విద్యాసాగర్	కొండాపురం	కమలాపురం
ప్రతాప్‌రెడ్డి	కమలాపురం	కొండాపురం
జయరామిరెడ్డి	వీఆర్ కడప	బద్వేలు
శ్రీనివాసులు	వీఆర్ కడప	డీఎస్‌బీ, కడప

బ్లాస్టింగ్ అనుమతుల కోసం
స్థల పరిశీలన



కొండాపురం మండలం తిరుమలాయిపల్లె సమీపంలో బ్లాస్టింగ్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో సాయిశ్రీ

కొండాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొంతికోన వద్ద ఏర్పాటవుతున్న హైడ్రోపవర్ ప్రాజెక్టుకు సంబంధించి బ్లాస్టింగ్ అనుమతుల కోసం స్థలాన్ని మంగళవారం జమ్మలమడుగు ఆర్డీవో ఆదిమూలపు సాయిశ్రీ పరిశీలించారు. ఇది కొండప్రాంతం కావడంతో వాహనాలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందిగా ఉందంటూ దారి కోసం హైడ్రోపవర్ ప్రాజెక్టు సబ్‌కాంట్రాక్ట్ సంస్థ రిత్విక్‌ప్రాజెక్టు బ్లాస్టింగ్ అనుమతులకు దరఖాస్తు చేసుకుంది. ఈ నేపథ్యంలో కె.బొమ్మేపల్లె రెవెన్యూ పరిధిలోని తిరుమలాయిపల్లె, రాగికుంట వద్ద ఉన్న కొండ ప్రాంతంలో పరిసరాలు బ్లాస్టింగ్‌కు అనుకూలంగా ఉన్నాయా లేవా అని ఆర్డీవో పరిశీలించారు. దగ్గరగా ఇళ్లు లేవని అందువల్ల బ్లాస్టింగ్ చేసుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని కంపెనీ ప్రతినిధులు ఆర్డీవోకు వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గురప్ప పాల్గొన్నారు.

నేడు జిల్లాలో పర్యటించనున్న
వైద్యశాఖ మంత్రి

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్యవిద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రానికి సమాచారం అందింది. మంత్రి నంద్యాల నుంచి బయలుదేరి రోడ్డు మార్గాన 11 గంటలకు కడపకు చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు హరిత టూరిజంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. 2 గంటలకు బయలుదేరి ప్రొద్దుటూరు మండలం కానాపల్లెకు చేరుకుని అక్కడ విలేజ్ హెల్త్ కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం ప్రొద్దుటూరులో పలు కార్యక్రమాల్లో పాల్గొని 5-45 గంటలకు రాయల్ కౌంటీకి చేరుకుంటారు. 6 నుంచి 8 గంటల వరకు ఓ కళాశాల వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. 9 గంటలకు బయలుదేరి నంద్యాల వెళతారు.

ఆధ్యాత్మిక లోగిలి...
కోదండరాముని సన్నిధి

ఒంటిమిట్ట కోదండరాముడి బ్రహ్మోత్సవాలు ఈనెల 5 నుంచి 15వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఈ మేరకు టీటీడీ అధికారికంగా నిర్ణయించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వానపత్రికలు కూడా అందచేసింది. టీటీడీ అధికారులు కడప జిల్లా యంత్రాంగంతో కలుపుకుని బ్రహ్మోత్సవాలు వైభవంగా చేసేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 11న రాత్రి 6.30 గంటల నుంచి జరిగే కల్యాణోత్సవానికి కనీవిని ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర భద్రాద్రి కోదండరాముడి ప్రాశస్త్యం గురించి మరోసారి మననం చేసుకుందాం...

- ఏకశిలానగరి... ప్రముఖ పర్యాటక గిరి
- కోదండరాముని చరితం ఆద్యంతం రాగరంజితం

రాజంపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఓ రామా.. కోదండ రామా... అని పిలిస్తే ఓ అంటూ భక్తులకు కనిపించి వారికి అభయం ఇచ్చే దేవుడిగా తరతరాల నుంచి కోదండరాముని పై భక్తుల్లో విశ్వాసం ఉంది. కడప జిల్లా కేంద్రానికి ఇటు రాజంపేటకు కేవలం 30 కిలోమీటర్ల దూరంలో చెన్నై-కడప జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ ఆలయం అద్భుత శిల్పకళా సంపదతో మన సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఉంది. ఒకే రాతి గుట్టపై నిర్మింబడి మూడు గోపురాలతో 32 అద్భుత శిల్పమయ స్తంభాలతో రంగమండపం, కల్యాణమండపం ఈ ఆలయం సొంతం. సీతారామలక్ష్మణులు ఒకే శిలపై వెలసి ఉన్నందున ఒంటిమిట్ట ఏకశిలా నగరంగా పేరు గడించింది. హనుమంతుడు లేకుండా నిర్మించిన ఏకైక ఆలయం ఒంటిమిట్ట కోదండరామాలయం. మట్లి పాలకుల్లో ఒకరైన సదాశివరాయల కాలం నాటి శిలాశాసనాలను బట్టి చూస్తే ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని 1350 సంవత్సరంలో ఉదయగిరిని పాలించిన కంపరాయులు నిర్మించినట్లు తెలుస్తోంది. 1356లో ఉదయగిరి సింహాసనాన్ని అధిష్ఠించిన కంప సోదరుడైన బుక్కరాయలు ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని ప్రారంభించాడు. మట్లి రాజుల్లో ఒక్కడైన అనంతరాజు రామాలయ గుడిని విస్తరించాడు. తూర్పుగాలిగోపురం, మహామండపం, మహాప్రాకారం, రథం నిర్మించారు. అలాగే ఉత్తర, దక్షిణ గోపుర నిర్మాణాలు మొదలు పెట్టగా అనంతరాజు కుమారుడైన తిరువెంగళ నాథరాజు మనవడు కుమార అనంతరాజు పూర్తి చేశాడు. ఒంటిమిట్ట కోదండరామాలయంలో రెండు శాసనాలు ఉన్నాయి. మొదటి శాసనం క్రీ.శ.. 1555లో, రెండవ శాసనం క్రీ.శ..1558లో వేయించారు. వీటి ప్రకారం విజయనగర పాలకుడు వీరసదాశివరాయల సామంతుడు గుత్తి తిరుమలయ్య దేవమహారాజు పులపత్తూరు గ్రామాన్ని ఆలయానికి దానంగా ఇచ్చాడు. కోదండరామాలయ ప్రాకార నిర్మాణాలకు, రథం, బ్రహ్మోత్సవాల నిర్వహణకు తిరుమల రాజయ్య, నాగరాజయ్య దేవమహరాజులు ఒంటిమిట్టను, చుట్టూ ఉన్న పల్లెలను, పొలాలను దానంగా ఇచ్చారు. ఈ రెండు శాసనాలను సదాశివరాయల మంత్రిగా ఉన్న తిరుమల రాజు అనుమతితో వేయించారు. శ్రీరామచంద్రుడు అరణ్యవాసం చేస్తూ ఒంటిమిట్టకు వచ్చినట్లు ఇతిహాసం చెబుతోంది. ఇక్కడ



ఏకశిలపై కొలువైన సీతా, రామ, లక్ష్మణ విగ్రహాలు

మునులు తపస్సులు చేసుకుంటూ ఉండేవారు. వీరికి

మిగతా 6వ పేజీలో...

పాపాఘ్ని నది బ్రిడ్జి పనులకు
మోక్షం!

- 7.33 ఎకరాల అప్పగింతకు అటవీ శాఖ ఆమోదం

కలికిరి / కడప, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కడప-ముద్దనూరు 716 జాతీయ రహదారిపై పాపాఘ్ని నది పైన బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన అటవీ భూములను అప్పగించడానికి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ వంతెన నిర్మాణానికి అవసరమైన 7.33 ఎకరాల అటవీ భూమిని బదలాయించేందుకు అన్ని రకాల అనుమతులు పూర్తయ్యాయి. 2023 నవంబరులో రాష్ట్ర అటవీ శాఖ పంపిన ప్రతిపాదనలకు ఎట్టకేలకు ఆమోదం లభించింది. దీన్ని ధ్రువీకరిస్తూ రాష్ట్ర పర్యావరణ అటవీ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రేణిగుంట - కడప - ముద్దనూరు మధ్య 716వ నంబరు జాతీయ రహదారిలో 153వ కిలోమీటరు వద్ద పాపాఘ్ని నది పైన పొడవాటి వంతెన నిర్మించాల్సి ఉంది. దీని కోసం అటవీ శాఖ భూములు అవసరమవుతాయి. ప్రొద్దుటూరు ఫారెస్ట్ రేంజికి సంబంధించి కమలాపురం బీట్ బ్లాక్-2లోని భూముల కోసం రాష్ట్ర అటవీ శాఖ కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఎట్టకేలకు 7.33 ఎకరాల భూమిని బదలాయించేందుకు కేంద్రం అనుమతులు జారీ చేసింది. వంతెన నిర్మాణానికి బదలాయిస్తున్న భూముల్లో రాష్ట్ర అటవీ శాఖ పర్యవేక్షణలోనే అభివృద్ధి పనులు చేపట్టాలని షరతు విధించారు. ఈ మేరకు రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.అనంతరాము కేంద్రం విధించిన షరతులకు సంబంధించిన ఆదేశాలు జారీ చేశారు.

రామాలయంలో కోయిల్ ఆళ్వార్
తిరుమంజనం



ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న ఆలయ అర్చకులు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్టలోని కోదండరామాలయంలో కోయిల్ అళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ముందు ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా ఉంది. కోదండరాముడి బ్రహ్మోత్సవాలు ఈనెల 5 నుంచి 14వ తేదీ వరకు జరగనున్నాయి. మంగళవారం ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేలుకొల్పి అర్చన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భాలయం, అంజనేయస్వామి గుడి, గరుత్మంతుని సన్నిధి ఆలయ ప్రాంగణం, గోడలు పైకప్పు, పూజా సామగ్రి తదితర అన్ని ప్రదేశాలను అన్ని వస్తువులను శుద్ధి చేశారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతి ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు వీణారాఘవాచార్యులు, శ్రావణ్‌కుమార్, మనోజ్ కుమార్, సిబ్బంది, ప్రవీణ్‌కుమార్, నాయక్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యపు గింజలపై శ్రీరామ నామం



బియ్యపు గింజలను తీసుకువస్తున్న రజని

కోదండరాముడి కల్యాణోత్సవానికి బియ్యపు గింజలపై శ్రీరామ నామం లిఖించిన తలంబ్రాలను భక్తులు ఆలయ అధికారులకు అందజేశారు. రాయచోటి ఆర్యవైశ్య సంఘానికి చెందిన రజని అనే భక్తురాలు బియ్యపు గింజలపై శ్రీరామ నామం లిఖించారు. మంగళవారం వీటిని అధికారులకు అందజేశారు. సుమారు 10,011 బియ్యపు గింజలపై శ్రీరామనామం లిఖించారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మనోహర్‌బాబు, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సభ్యులు కిరణ్‌కుమార్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జవాబుదారీతనంతో పనిచేయాలి

- రెవెన్యూ సమస్యలపై సమీక్షలో కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీల పరిష్కారం కోసం మరింత జవాబుదారీతనంతో పనిచేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో రెవెన్యూ సమస్యలపై జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడుతో కలసి ఆర్డీవోలతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర స్థాయిలో జిల్లా ర్యాంకింగ్ మరింత మెరుగుపడాలన్నారు. ఆర్డీవోలు ఆయా మండలాల్లోని గ్రామాలను ప్రణాళికబద్ధంగా ఎంచుకుని సమస్యలను క్రోడీకరించుకుని ఎటువంటి సమస్యలు లేకుండా గోల్డెన్ విలేజ్‌లుగా తీర్చిదిద్దాలన్నారు. ఆయా డివిజన్ల ఆర్డీవోలు ఆరునెలలు, సంవత్సర యాక్షన్‌ప్లాన్ రూపొందించుకుని సమస్యలను పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా మండలాల్లో ఆయా గ్రామాలకు సంబంధించి వచ్చిన పీజీఆర్ఎస్ అర్జీలు అన్నింటినీ పరిశీలించి సమస్యలను అర్థం చేసుకోవాలన్నారు. మిగులు భూములు, చుక్కల భూములు, ప్రభుత్వ భూములు, ఫారెస్ట్ భూముల సమస్యలకు పూర్తి పరిష్కారం చూపాలన్నారు. ఈ సమావేశంలో కడప, పులివెందుల, బద్వేలు, జమ్మలమడుగు ఆర్డీవోలు జాన్‌ఇర్విన్, చిన్నయ్య, చంద్రమోహన్, సాయిశ్రీ, కలెక్టరేట్ ఏవో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

94శాతం పింఛన్ల పంపిణీ

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను జిల్లాలో 94శాతం పంపిణీ చేశారు. 2,56,266 మంది లబ్ధిదారులు ఉండగా 2,40,255 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. మరో 16,011 మందికి పంపిణీ చేయాల్సి ఉంది. జిల్లాలో మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఏపీడీ ప్రసాద్ నేతృత్వంలో పర్యవేక్షించారు. బద్వేలు మున్సిపాలిటీలో 95.72శాతం పంపిణీ చేసి ప్రథమ స్థానంలో నిలవగా తొండూరు మండలం 88.94 శాతంతో చివరిస్థానంలో నిలిచింది. కడప నగరంలోని 19, 21 డివిజన్లలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సింగారెడ్డి గోవర్ధన్‌రెడ్డి, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శివశంకర్‌రెడ్డి సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

ఐటీ పార్కుకోసం స్థల పరిశీలన

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐటీ పార్కు ఏర్పాటు కోసం కడప ఎమ్మెల్యే ఆర్.మాధవితో కలసి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మగళవారం రిమ్స్ సమీపంలోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. పుట్లంపల్లి పంచాయతీ పరిధిలోని పాలకొండల వద్ద ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమికి సంబంధించిన రికార్డులను, మ్యాపులను పరిశీలించారు. చుట్టుపక్కల గతంలో ఇతరులకు కేటాయించిన ప్రభుత్వ స్థలాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరిశీలించిన భూమి ఐటీ పార్కు ఏర్పాటుకు అనువుగా ఉందని, అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనకు, ఇతర వనరులు సమకూర్చుకునేందుకు ఆ ప్రాంతం చక్కగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, తహశీల్దారు నారాయణ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అరుదైన సమస్య ఆటిజం

- కుటుంబ మద్దతే దీనికి ప్రధాన చికిత్స
- నేడు ఆటిజం డే



కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆటిజం అంటే మందబుద్ధి. దీనిబారిన పడ్డవారికి కుటుంబ మద్దతు, ప్రేమే ప్రధాన చికిత్స. ఏప్రిల్ రెండవ తేదీన ఆటిజం అవగాహన దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారు. మన దేశంలో సుమారు 18.5 మిలియన్ల మంది ఆటిజంతో బాధపడుతున్నారని అంచనా. సాధారణంగా ఇది పిల్లల్లో కనిపిస్తుంటుంది. తీవ్రత రెండు నుంచి తొమ్మిది సంవత్సరాల పిల్లల్లో ఎక్కువగా ఉంటుంది. బాలికలతో పోలిస్తే బాలురలో ఇది ఎక్కువ.

ఆటిజం అంటే..

పుట్టిన పిల్లల పెరుగుదలలో వ్యత్యాసం, వయసుకు తగ్గట్టు పిల్లల్లో రావాల్సిన మానసిక ఎదుగుదల రాకుండా ఉండే పరిస్థితినే ఆటిజం అంటారు. ఆటిజంను వాడుక భాషలో మందబుద్ధిగా.. వైద్య భాషలో నాడీ సంబంధిత రుగ్మత(న్యూరోలాజికల్ డిజార్డర్)గా పిలుస్తారు. ఇది అరుదైన సమస్య. ఆటిజం సమస్య గల పిల్లల మెదడులోని కొంతభాగం సరిగా పనిచేయకపోవడం వల్ల వారు ఇతర పిల్లలతో భిన్నంగా వ్యవహరిస్తారు. సాధారణంగా ఆటిజం లక్షణాలు రెండు లేదా మూడు సంవత్సరాల వయసులోనే తెలుస్తాయి.

ఆటిజం రావడానికి కారణాలు

ఆటిజం వ్యాధి ఎక్కువ శాతం జన్యుపరమైన కారణాల వల్ల వస్తుంది. మేనరికపు వివాహాలు, గర్భిణీ సమయంలో ఇన్ఫెక్షన్‌లకు గురికావడం, తీవ్రమైన ఉద్వేగాలకు లోనుకావడం, శిశువు మెదడు ఎదుగుదలకు అవసరమైన జన్యువులు, సెరటోనిన్, డోపమిన్ వంటి రసాయనాలు తగినంత అందకపోవడం, నెలలు నిండకుండానే శిశువులు పుట్టడం వంటివి ప్రధాన కారణాలుగా పరిగణిస్తారు. ఒక్కోసారి తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడపకపోవడం, సమాజం, చుట్టుపక్కల వారితో సరిగా ఉండకపోవం వల్ల కూడా పిల్లలు ఆటిజం బారిన పడుతుంటారు. తల్లిదండ్రుల ప్రవర్తన ఈ వ్యాధిలో కీలకంగా చెప్పవచ్చు.


ఆటిజం గుర్తించడం ఎలా?

సాధారణంగా పుట్టిన శిశువులలో బోసి నవ్వులు ఉండకపోవడం, ఏడాది వయసు వచ్చినా పాకడం, నవ్వడం, చిన్నచిన్న శబ్దాలు పలకకపోవడం, పిలుపునకు బదులివ్వకపోవడం ఆటిజంలో అతి సాధారణంగా కనిపించే లక్షణాలు. వీటిని ప్రాథమిక సూచనలుగా పరిగణిస్తారు. ఆలస్యంగా మాట్లాడడం, మాటలు చెప్పేందుకు ఇబ్బంది, సైగలను అర్థం చేసుకోవడంలో ఇబ్బంది పడడం, స్తబ్దుగా ఉండడం, ఇతరులతో కనెక్షన్ ఏర్పరచుకోలేక పోవడం, కంటి చూపులో తేడా, ఒంటరిగా తమలో తామే మాట్లాడుకోవడం, శరీరాన్ని నియంత్రణ చేసుకోలేకపోవడం, పిలిచినా పలకకపోవడం, దెబ్బతగిలినా తెలుసుకోలేకపోవడం, అనవసరంగా ఏడుస్తూ ఉండడం తదితర కారణాలను సైతం పరిగణనలోకి తీసుకుని ఆటిజంను నిర్ధారణ చేయవచ్చు.

ఆటిజం రాకుండా ఉండాలంటే...

ఆటిజం రాకుండా ఉండాలంటే ఇలా చేయాలి అనే కచ్చితమైన విషయాలు లేవు. అయితే అధిక శాతం ఆటిజంను అధిగమించేందుకు వైద్యులు కొన్ని రకాల జాగ్రత్తలు తెలుపుతున్నారు. గర్భంలోని శిశువు ఎదుగుదలకు సంబంధించిన చెకప్‌లు తప్పనిసరిగా వైద్యుల పర్యవేక్షణలో చేయించుకోవాలి. గర్భధారణ సమయంలో ఒత్తిడి, ధూమపానం, ఆల్కహాల్, డ్రగ్స్, వాయుకాలుష్యం, మానసిక సంఘర్షణలకు దూరంగా ఉండేలా చూసుకోవాలి. గర్భిణిలు కొన్ని రకాల టీకాలను వేయించుకోవాలి. తల్లులు నిర్దిష్ట పోషకాలు, సప్లిమెంట్లను డాక్టర్ల సూచన మేరకు తీసుకోవాలి. బిడ్డ పుట్టిన తర్వాత వారితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎక్కువ సమయం గడపాలి. అయినా ఆటిజం బారిన పడితే మాత్రం వైద్యుల సలహా మేరకు చికిత్స తీసుకుంటూ జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలి. పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం ఇవ్వాలి. శరీరం, మెదడు ఎదుగుదలకు సహాయపడే బలవర్ధక ఆహారాన్ని అందిస్తుండాలి. ఆటిజం బారిన పడ్డ పిల్లలతో కుటుంబసభ్యులు ప్రేమగా ఉండాలి.

ఆటిజంపై అవగాహన పెంచుకోవాలి



ఆటిజం బారినపడకుండా ముందుగా అవగాహన పెంచుకోవాలి. గర్భధారణ నుంచి వైద్యుల పర్యవేక్షణ, సలహాలు పాటించాలి. ఆటిజం బారిన పడితే ముందుగానే గుర్తించి సరైన చికిత్స అందివ్వడం వల్ల కొంత మెరుగుపరచడానికి అవకాశం ఉంటుంది. ప్రతిరోజు ఆటిజం రోగులు నాలుగు నుంచి ఐదుగురు ఓపీకి వస్తున్నారు. ఇక సర్టిఫికెట్ల కోసం అయితే రిమ్స్ ఆసుపత్రిలోని మెంటల్ హెల్త్‌కేర్ ఆసుపత్రికి సుమారు 8 నుంచి 10 మంది వస్తుంటారు. ఆటిజంపై అవగాహన పెంచుకుంటే దీనిని నివారించవచ్చు.

- డాక్టర్ వెంకటరాముడు, సూపరింటెండెంట్, మెంటల్ హెల్త్‌కేర్ వైద్యశాల, రిమ్స్

ముగిసిన పది పరీక్షలు



చివరి పరీక్ష రాసి ఆనందంగా బయటకు వస్తున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగిశాయి. జిల్లాలో మంగళవారం జరిగిన సోషల్ స్టడీస్ పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 27,768 మందికి గాను 27,624 మంది హాజరై 144 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులకు సంబంధించి 22 మందికి 19 మంది హాజరయ్యారు. పరీక్షల పరిశీలకులు బి.మధుసూదనరావు నాలుగు కేంద్రాలను పరిశీలించగా, డీఈవో షంషుద్దీన్ ఐదు కేంద్రాలను సందర్శించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 50 కేంద్రాలను తనిఖీ చేశారు. 84 కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటుచేశారు. పరీక్షల నిర్వహణకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. కాగా మంగళవారం పరీక్షలు ముగియడంతో పరీక్ష కేంద్రాల నుంచి బయటకు రాగానే విద్యార్థులు కేరింతలు కొట్టారు. హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్న విద్యార్థులు లగేజీ సర్దుకుని తల్లిదండ్రులతో సొంత గ్రామాలకు పయనమయ్యారు. దీనితో ఆర్టీసీ బస్టాండ్ రద్దీగా మారింది.

పేపర్ లీక్‌తో..

వల్లూరు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మార్చి 24వ తేదీన జరిగిన గణిత పరీక్షలో ప్రశ్నాపత్రం లీక్ అయింది. ఈ నేపథ్యంలో విద్యార్థిని డిబార్ చేశారు. చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు డిపార్ట్‌మెంట్ అధికారి, ఇన్విజిలేటర్ మరో ఐదుగురిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. మార్చి 19న కడపలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల పరీక్ష కేంద్రానికి సెల్‌ఫోన్ తీసుకొచ్చినందుకు విద్యార్థిని డిబార్ చేయడంతో పాటు విధుల పట్ల అలసత్వం వహించిన ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేశారు.



పరీక్షలు అయిపోవడంతో అమ్మాయిల సెల్ఫీ

ఆధ్యాత్మిక లోగిలి.. కోదండరాముని సన్నిధి..

(5వ పేజీ తరువాయి)

రాక్షసుల బెడద ఎక్కువగా ఉండటంతో యజ్ఞయాగాదులు నిర్వహించలేకపోయారు. మహాముని కోరికపై శ్రీరామలక్ష్మణులు రాక్షస సంహారం చేసిన అనంతరం మునుల యజ్ఞయాగాదులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఒకే శిలలో నిర్మితమైన సీతారామలక్ష్మణ విగ్రహాలను మునులకు ప్రదానం చేశారట. ఈ విగ్రహాలు మూడు విడివిడిగా కనిపించినా ఇవన్నీ ఒకే శిలపై ఆవిర్భవించి ఉన్నందున ఒంటిమిట్టకు ఏక శిలా నగరం అని పేరు వచ్చింది. అరణ్యవాసంలో భాగంగా శ్రీరాముడు అమ్ములపొది, పిడిబాకు, కోదండం చేతపట్టి రావడంతో కోదండరాముడు అనే నామం వచ్చింది.



ఒంటిమిట్ట కోదండరామాలయంలోని అపురూప శిల్పకళాసంపద

ఓ మధురానుభూతి...

కోదండరాముడి ఆలయాన్ని సందర్శించడం ప్రతి ఒక్కరికీ మధురానుభూతిని కలిగిస్తుంది. ఇక్కడి కోదండరామాలయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే ఒక అద్భుత దృశ్యం గోచరమవుతుంది. ఒక ఎత్తయిన పీఠంపై ఉన్న ఆలయం.. చుట్టూ చిన్న, పెద్ద గుట్టలు కనిపిస్తాయి. ఆ గుట్టలన్నీ పుష్పరేకులు గానూ.. మధ్యలో ఉన్న దేవాలయం కర్ణికగా అమరి ఉండటం ప్రత్యేకత. ఎంతో చారిత్రక, మరెంతో ప్రాధాన్యం కలిగిన ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని సందర్శించడం మధురానుభూతిని కలిగిస్తుంది. కోదండరాముడి సేవలో ఎందరో మహానుభావులు తరించేవారని చరిత్ర చెబుతోంది.

సాహితీ ఉద్దండుడు బమ్మెర పోతనామాత్యుడు, తిప్పయ్య, అయ్యలరాజు రామభద్రుడు, తిప్పకవి, మాల ఓబన్న, ఆంధ్రా వాల్మీకి వావిలకొలను సుబ్బారావు, నల్లకాల్వ అయ్యప్ప, ఉప్పుగొండూరు వెంకటకవి, తాళ్లపాక అన్నమాచార్య, పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వంటి కవులు, భక్తులు, మహనీయులు ఎందరో రామయ్య సేవలో తరించిన వారే. మహాభాగవతాన్ని తనకు అంకితమివ్వమని పోతనను శ్రీరాముడు కోరినది ఇక్కడేనని ప్రతీతి.

ఇమాంబేగ్ పిలుపు.. రామయ్య పలుకు...

క్రీ.శ..1640 ప్రాంతంలో కడపను పాలించిన అబ్దుల్ నబీఖాన్ ప్రతినిధి ఇమాంబేగ్ ఒంటిమిట్ట కోదండరాముడి మహిమను పరీక్షించేందుకు వచ్చాడట. గుడి లోపలికి వెళ్లి ఓ రామా..! ఒంటిమిట్ట రఘురామ..! అని మూడుమార్లు పిలువగా గుడి లోంచి ఓ.ఓ.ఓ.. అనే సమాధానం వినపడింది. దాంతో ఇమాంబేగ్ ఆనందంతో మోకరిల్లి రాముడి భక్తునిగా మారాడు. శ్రీరాముని కైంకర్యం కోసం ఒక బావిని కూడా తవ్వించారు. ఆలయం వద్ద ఆ బావిని నేటికీ చూడవచ్చు. అందువల్లే ప్రతి శుక్రవారం ఒంటిమిట్ట మండలం మంటపంపల్లె దర్గాకు వెళ్లే ముస్లింలు తిరిగి వస్తూ కోదండరాముడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించడం విశేషంగా చెప్పుకోవచ్చు.

అపురూప శిల్పసంపద

ఒంటిమిట్ట కోదండరామాలయంలోని అపురూప శిల్పసంపద భక్తులను ఘైమరపిస్తుంది. రంగమండపంలోని 32 శిలా స్తంభాల్లో మూడు ముఖాలు కలిగిన అపురూప శిల్పాలు రామాయణ, భాగవతార్‌లను, నాటి పాలకుల రసజ్ఞతలను ప్రదర్శిస్తున్నాయి.

జాంబవంత ప్రతిష్ఠ

త్రేతాయుగంలో ఒంటిమిట్ట ప్రాంతానికి వచ్చిన జాంబవంతుడు ఒకనాటి రాత్రి విశ్రమించగా స్వప్నంలో సీతారామలక్ష్మణులు దర్శనమిచ్చారట. జాంబవంతుడు ఉదయమే లేచి పరిసరాల్లో వెతకగా ఒక గుబురు పొదల్లో సీతారామ లక్ష్మణ విగ్రహాలు కనిపించాయి. దాంతో జాంబవంతుడు ఆనందభరితుడై మంత్రోచ్చారణలతో సీతారామలక్ష్మణ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అందువల్లే జాంబవంత ప్రతిష్ఠ అని పేరు వచ్చింది.

రామ లక్ష్మణ బాణాలకు వెలసిన తీర్థాలు

అరణ్యవాసంలో భాగంగా పర్యటించిన సీతారామలక్ష్మణులు అలసి ఒక చెట్టునీడన చేరారు. ఆ సమయంలో సీతాదేవికి దాహంగా ఉండటంతో శ్రీరాముడు బాణాన్ని భూమిలోకి సంధించగా పాతాళం నుంచి గంగ పెల్లుబికింది. దీంతో ముగ్గురు దాహం తీర్చుకున్నారు. అదే సమయంలో లక్ష్మణుడు కూడా భూమిలోకి బాణం సంధించగా గంగ ఉద్భవించింది. అప్పటి నుంచి ఇవి శ్రీరామలక్ష్మణ తీర్థాలుగా ప్రసిద్ధి చెందాయి.



చంద్రబాబు నిలిపిన ప్రాణానికి

నారా లోకేశ్ అండ

● చిన్నారి జ్ఞానసాయికి పింఛను మంజూరు ● చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



చిన్నారికి పింఛను పంపిణీ చేస్తున్న జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలిపిన ప్రాణానికి మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచారు. 2016లో కాలేయ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి జ్ఞానసాయి ప్రాణాలు కాపాడేందుకు అప్పట్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చూపిన చొరవ ఇప్పటికీ అందరికీ గుర్తుండిపోయింది. నిస్సహాయ స్థితిలో జన్మనిచ్చిన తల్లిదండ్రులే బిడ్డను చంపుకునేందుకు సిద్ధమైన సమయంలో చంద్రబాబు ప్రభుత్వ సాయంతో వైద్య, శస్త్ర చికిత్స అందించి ఆ ఇంటి దీపం ఆరిపోకుండా చేశారు. ములకలచెరువు మండలం వేపూరికోట పంచాయతీ ఆర్‌ఎస్ కొత్తపల్లెకు చెందిన జల్లా రమణప్ప, సరస్వతి దంపతులు తమకున్న రెండు ఎకరాల్లో పూల సాగు చేస్తూ జీవనం సాగించేవారు. వీరి మొదటి సంతానం జ్ఞానసాయికి పుట్టుకతోనే కాలేయ వ్యాధి సోకింది. మదనపల్లె, తిరుపతి, బెంగళూరులోని పలు ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించారు. బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో ఎనిమిది నెలల వయస్సులో రూ.5 లక్షలు ఖర్చు చేసి శస్త్ర చికిత్స చేయించగా అది వికటించింది. దీంతో పాపను బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా కాలేయ మార్పిడి చేయాలని, దీనికి రూ.30 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. అంత డబ్బు ఖర్చు చేసి బిడ్డను బతికించుకోలేమని మెర్సీ కిల్లింగ్ (కారుణ్య మరణానికి) అనుమతి కోరుతూ తల్లిదండ్రులు కోర్టును ఆశ్రయించిన ఈ హృదయ విచారకర సంఘటన 2016 సంవత్సరం జూన్ నెలలో రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పాప ఆరోగ్య పరిస్థితిపై చలించిపోయారు. తక్షణం స్పందించి శస్త్ర చికిత్సకు అయ్యే ఖర్చు పూర్తిగా భరిస్తామని ప్రకటించి చిన్నారికి చెన్నైలోని గ్లోబల్ ఆస్పత్రిలో ప్రపంచ ప్రఖ్యాత వైద్య నిపుణుడు మహ్మద్ రేలా శస్త్ర చికిత్స చేశారు. తండ్రి రమణప్ప కాలేయాన్ని తీసి చిన్నారికి అమర్చారు. పూర్తిగా ప్రభుత్వ ఖర్చుతో చేయించిన ఈ శస్త్ర చికిత్స విజయవంతమై పాప కోలుకుంది. శస్త్ర చికిత్స, వైద్య పరీక్షల కోసం అప్పట్లో రూ.35 లక్షల వరకు ఖర్చయింది అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిన్నారికి పింఛను మంజూరు చేసి తండ్రికి తంబళ్లపల్లెలోని ఎస్టీ హాస్టల్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించి అండగా నిలిచారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2022లో జ్ఞానసాయి పింఛను తొలగించింది. పాప పరిస్థితి చూసి పింఛను మంజూరు చేయాలని ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం లేకుండాపోయింది. ఈ క్రమంలో 2023 మార్చి నెలలో తంబళ్లపల్లె నియోజకవర్గంలో జరిగిన యువగళం పాదయాత్రలో నారా లోకేశ్‌ను జ్ఞానసాయి కుటుంబం కలిసి విషయాన్ని వివరించింది. పాపకు ప్రతి నెలా మందులకు రూ.20 వేలు ఖర్చు అవుతుందని, పింఛను పునరుద్ధరిస్తే ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. వచ్చేది తమ ప్రభుత్వమేనని జ్ఞానసాయికి కచ్చితంగా పింఛను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి విషయాన్ని ఇటీవల మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లడంతో మంత్రి సూచనలతో ప్రభుత్వం జ్ఞానసాయికి ఏప్రిల్ నుంచి రూ.10 వేలు చొప్పున ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛను మంజూరు చేసింది. దీంతో మంగళవారం జయచంద్రారెడ్డి ఆ బాలికకు పింఛను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారి జ్ఞానసాయి, కుటుంబీకులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ములకలచెరువులోని శారదా విద్యామందిర్‌లో బాలికకు సీటు ఇప్పించి ఉచితంగా విద్య అందిస్తానని ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ప్రకటించారు. పాఠశాల కరస్పాండెంట్ సనత్‌కుమార్‌తో మాట్లాడి అడ్మిషన్ ఇప్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, ఎంపీడీవో హరినారాయణ, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, నేతలు మూగి రవిచంద్ర, ఆంజనేయరెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాలాజీ, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు జయరామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

వాల్మీకిపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటన సోమవారం రాత్రి వాల్మీకిపురంలో జరిగింది. పట్టణానికి సమీపంలోని ఓ కాలనీకి చెందిన బాలికపై జేసీబీ డ్రైవర్‌గా పనిచేసే అశోక్ అనే యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు



రామసముద్రం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తన భార్య కనిపించడం లేదని మండలంలోని అరికెల పంచాయతీ నాగపల్లెకు చెందిన గణేశ్ మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మార్చి 31న తన భార్య మౌనిక (20) ఇంటి నుంచి వెళ్లిందని ఫిర్యాదులో పేర్కొనడంతో, ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. కోటకొండకు చెందిన వెంకటరమణ కుమారుడు వంశీకుమార్ సంగం పాల డెయిరీలో పనిచేస్తాడు. పని ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళుతుండగా బెస్తపల్లె సర్కిల్ వద్ద బొలెరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో వంశీకుమార్‌కు, బొలెరో డ్రైవర్ ఖాజాపీర్ గాయపడ్డారు. వారిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సిలిండర్ లారీ బోల్తా : తప్పిన ప్రమాదం



బోల్తా పడ్డ సిలిండర్ల లారీ

సంబేపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిలోని సంబేపల్లె టౌన్ వడ్లపల్లి క్రాస్ వద్ద మంగళవారం తెల్లవారుజామున గ్యాస్ సిలిండర్ లోడ్‌తో కడప నుంచి నిమ్మనపల్లికి వెళుతున్న లారీ సంబేపల్లె వద్ద రోడ్డు డివైడర్‌ను ఢీకొనడంతో బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఎటువంటి మంటలు వ్యాపించకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. దీంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని సిలిండర్లను మరొక లారీలోకి బదిలీ చేయించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగడంతో ఒకవైపు వాహనాలు వెళ్లేలా పోలీసులు దగ్గరుండి చర్యలు చేపట్టారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



వెంకటరమణ మృతదేహం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారిలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బంధువుల వివరాల మేరకు... పట్టణంలోని ఆరాధ్య ఆస్పత్రికి సమీపంలోని ప్రధాన దారి పక్కనే నివాసం ఉంటున్న పెనుబాల వెంకటరమణ (47) అనే వ్యక్తి బార్బర్ షాపు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా భార్య, బిడ్డలతో దూరంగా ఉంటున్నాడని బంధువులు తెలిపారు. ఆదివారం రాత్రి మద్యం తాగి మిద్దెపై నిద్రించాడు. మిద్దెకు అవతలి వైపు గోడ లేని కారణంగా దొర్లుకుని కిందపడడంతో మృతి చెంది ఉంటాడని బంధువులు అంటున్నారు. మృతుడికి భార్య చాముండేశ్వరి, కుమారులు గోపీచంద్, దినేశ్‌కార్తీక్‌లు ఉన్నారు. వెంకటరమణ మద్యం తాగి మిద్దెపైనుంచి ప్రమాదవశాత్తు పడ్డాడా? లేక ఎవరైనా తోసి ఉంటారా? అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాంఘిక సంక్షేమ అధికారి డిప్యుటేషన్ పొడిగింపు

కలికిరి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా షెడ్యూల్డ్ క్యాస్ట్స్ సర్వీసు కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీఎస్‌సీఎస్‌సీఎస్) ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా డెప్యుటేషన్‌లో ఉన్న జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి (డీఎస్‌డబ్ల్యూఓ) ఆర్.రవీంద్రనాథరెడ్డి డెప్యుటేషన్ గడువును మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మార్చి 22 నుంచి 2026 జూన్ 30 వరకూ వర్తించే విధంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు కృషి

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదలకు ప్రభుత్వం పంచ ప్రాధాన్యాల లక్ష్యాన్ని నిర్దేశించిందని ఈ మేరకు వివిధ అభివృద్ధి పథకాలను చేపడుతున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా నిర్దేశించిన పంచ ప్రాధాన్యాలలో భాగంగా పశువుల నీటితొట్టెలు, ఫారంపాండ్ల నిర్మాణం, పంట కాలువలు, చెరువుల్లో పూడికతీత, ఉపాధి కూలీలకు సగటు వేతనం రోజుకు కనీసం రూ.290 ఉండేలా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ మేరకు 2025-26 మొదటి త్రైమాసికానికి రూ.266 కోట్ల లక్ష్యంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకెళుతున్నామన్నారు. ఇందులో రూ.85.52 కోట్ల అంచనాతో 11 వేల ఫారంపాండ్ల నిర్మాణం, రూ.21.71 కోట్ల అంచనాతో పంట కాలువల్లో పూడికతీత, రూ.3.47 కోట్ల అంచనాతో 1034 పశువుల నీటి తొట్టెల నిర్మాణం, రూ.5.56 కోట్ల ఖర్చుతో సాగునీటి చెరువుల్లో పూడిక తీయడం, రూ.150.43 కోట్ల అంచనాతో వేతన జీవులకు 49 లక్షల పనిదినాలు కల్పించడమే లక్ష్యంగా ఉపాధి హామీ పథకం ద్వారా కృషి చేస్తామని తెలిపారు.

జిల్లాలో నీటి ఎద్దడి నివారించడానికి రూ.7.95 కోట్లతో ప్రణాళికను ప్రభుత్వానికి ప్రతిపాదించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం 116 గ్రామాల్లో నీటి సరఫరా జరుగుతోందన్నారు. వేసవి దృష్ట్యా రాబోయే కాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి నివారించానికి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ నిధుల అనుసంధానంతో రూ.243.74 కోట్ల ఖర్చుతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. సమావేశంలో డ్వామా పీడీ వెంకటరత్నం, పంచాయతీరాజ్ ఎస్ఈ దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



రైల్వేకోడూరు ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట వడ్డిపల్లెకు చెందిన చామల సుబ్బరాయుడు (47) గత నెల 23న తలకు పూసుకునే రంగు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. అనంతరాజుపేట వడ్డిపల్లెకు చెందిన సుబ్బరాయుడు భార్యకు దూరంగా ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతడికి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో తలకు పూసుకునే రంగు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


కాంట్రాక్టు ఉద్యోగి మృతికి పరిహారం

కలికిరి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల వర్క్‌షాపులో కాంట్రాక్టు అటెండరుగా ఉద్యోగం చేస్తూ ఆకస్మికంగా మృతి చెందిన వై.ఉమా మల్లికార్జున దేవరాయలుకు పరిహారం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2024 అక్టోబరు 14న విధి నిర్వహణలో గుండె పోటుతో మృతి చెందాడు. అధికారులు నిర్ణీత వ్యవధిలో ప్రభుత్వానికి సమాచారం సమర్పించడంతో మృతుడి భార్య వై. నాగమ్మకు ప్రభుత్వం రూ.2 లక్షలు నిధులు విడుదల చేసింది. రాష్ట్ర ఆర్థిక శాఖ కూడా దీనికి ఆమోదం తెలిపింది. ఈ మేరకు స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

కూటమి జెండా పైపు ధ్వంసం

● జెండాలు కాల్చివేత

● పోలీసులకు ఫిర్యాదు చేసిన నాయకులు



నిరసన తెలుపుతున్న నాయకులు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటకొండ ఎగువ సుగాలి తాండాలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు కూటమి జెండా ఉన్న పైపును ధ్వంసం చేసి, జెండాలను కాల్చివేశారు. స్థానిక నాయకులు తెలిపిన వివరాల మేరకు.. గత నెల 30న బీజేపీ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేంద్రనాయక్, కూటమి నాయకులతో కలసి జెండా దిమ్మె ఏర్పాటు చేసి కూటమి జెండాలను ఆవిష్కరించారు. మరుసటి రోజు సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు జెండా దిమ్మెకు ఉన్న పైపును ధ్వంసం చేసి జెండాలను కాల్చివేశారు.

మంగళవారం ఉదయం మండల టీడీపీ, బీజేపీ అధ్యక్షులు రెడ్డెప్పరెడ్డి, వెంకటరమణ ఘటనా స్థలాన్ని పరిశీలించి నిరసన తెలిపి సంఘటనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తంబళ్లపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ లోకేశ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి కాలా నారాయణ, పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, గురుమూర్తి, బీజేపీ నాయకులు శంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివానాయక్, వెంకటేష్ నాయక్, వీరభద్రనాయక్, కోన భాస్కర్, వైవీ రమణారెడ్డి, డాన్స్ రెడ్డన్న తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం కేసులో ఐదేళ్ల జైలుశిక్ష



జైలుశిక్ష పడ్డ నిందితుడు సత్యమోహన్

రామాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ముద్దాయి సత్యమోహన్‌కు ఐదు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహామూర్తి మంగళవారం తీర్పునిచ్చారని రాయచోటి రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17-5-2019వ తేదీ రామాపురం మండలం పత్తి కనుమ రస్తా, సరస్వతిపల్లి బీట్, వంగిమళ్ల సెక్షన్, రాయచోటి రేంజ్‌లో ఒక సుమోలో నాలుగు ఎర్రచందనం దుంగలను అక్రమంగా రవాణా చేస్తున్న డ్రైవర్ సత్యమోహన్‌ను అరెస్టు చేసి కేసు కోర్టులో హాజరు పరిచి రాయచోటి సబ్‌జైలుకు తరలించారన్నారు. మంగళవారం జరిగిన తీర్పులో ముద్దాయికి శిక్ష పడటంతో నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారని ఫారెస్టు తెలిపారు.

మిడిమానుకొండకు నిప్పు



మంటలు ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది, రైతులు

గుర్రంకొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిల ఆగడాలకు కొండలు, గుట్టలు కాలిబూడిదవుతున్నాయి. గుర్రంకొండ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో మిడిమానుకొండ ఉంది. ఈ కొండకు సోమవారం రాత్రి ఆకతాయిలు నిప్పంటించారు. దీంతో కొండ మొత్తం కాలిపోయి కొండ కిందున్న పొలాల్లోకి మంటలు వ్యాపించాయి. ఈ క్రమంలో రైతులు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించిన సాధ్యం కాలేదు. దీంతో ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలు పొలాల్లోకి వ్యాపించకుండా అదుపు చేశారు. అప్పటికే కొంత మంది రైతుల పొలాల్లో మామిడి, అల్లనేరుడు చెట్లు దెబ్బతినట్లు రైతులు వాపోతున్నారు.

రాయచోటిలో గ్యాంగ్ వార్

● రెండు వర్గాల మధ్య ఘర్షణ

● 9 మందిపై కేసు నమోదు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో గత కొంత కాలంగా గ్యాంగ్ వార్ నడుస్తోంది. ఈ క్రమంలోనే పాత కక్ష్యలను మనసులో పెట్టుకుని సోమవారం అర్థరాత్రి మద్యం మత్తులో రెండు గ్యాంగ్‌లు రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీ చెక్‌పోస్టు సమీపంలో జాతీయ రహదారిపై హల్‌చల్ చేశాయి. కత్తులు, కట్టెలతో ఘర్షణకు దిగడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని రాయచోటి ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ సంఘటనపై రాయచోటి అర్బన్ పోలీసులు 9 మందిపై 307, 324 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ప్రాంతానికి చెందిన దేశ్‌ముఖ్ రియాన్, దేశ్‌ముఖ్ ఇమ్రాన్ అన్నదమ్ముల గ్యాంగ్‌కు, అదే ప్రాంతానికి చెందిన నిస్సార్ అలియాస్ డాకు మహరాజ్, చాను, నూర్ గౌస్‌ల మధ్య పాత కక్షలు ఉండేవి. ఈ క్రమంలో ముందుగా సోమవారం రాత్రి దేశ్‌ముఖ్ రియాన్, దేశ్‌ముఖ్ ఇమ్రాన్, అహ్మద్ తదితరులు కలిసి చాను, నూర్‌లపై దాడి చేశారు. దీంతో వారిరువురూ కలిసి జరిగిన విషయాన్ని తమ గ్యాంగ్‌కు సంబంధించిన ఎస్ఆర్ అలియాస్ డాకు మహరాజుకు సమాచారం ఇవ్వడంతో వారు తమ గ్యాంగ్‌తో కలిసి 30 మందికిపైగా రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీకి చేరుకొని అక్కడున్న ఇమ్రాన్, రియాన్ అహ్మద్‌లపై కత్తులు, కట్టెలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అయితే ఎస్ఎన్ కాలనీలో రెండు గ్యాంగ్‌ల మధ్య పెద్ద ఎత్తున గొడవ జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోవడంతో దాడికి పాల్పడ్డ వారు వాహనాల్లో పరారయ్యారు. ఈ క్రమంలో నిస్సార్ అలియాస్ డాకు మహరాజ్ మరికొంత మంది కలిసి ఇన్నోవా కారులో కడప వైపు వెళుతూ రింగు రోడ్డు సమీపంలో వాహనాల తనిఖీల్లో ఉన్న పోలీసు వాహనాన్ని ఢీకొని పరారయ్యారు. గతంలో వీరంతా ఒక పట్టణ టీడీపీ నాయకుడి వద్ద ఉండేవారని సమాచారం. గతంలో జరిగిన గొడవల్లో పోలీసులు చితకబాదడంతో ఆ నాయకుడు వారిని పట్టించుకోకపోవడంతో వారంతా ఆయన నుంచి విడిపోయి ప్రస్తుతం మరో టీడీపీ నాయకుడి వద్దకు వద్ద చేరి గ్యాంగ్ వార్ నడుపుతున్నట్లు తెలుస్తోంది. బాధితుల ఫిర్యాదు మేరకు నిస్సార్ అలియాస్ డాకు మహరాజ్ చాన్‌నూర్, ఫయాజ్ ఖార్ తదితర 9 మందిపై పోలీసులు 307, 324 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటచలపతి తెలిపారు.

ఇకపై మోత ఉండదు

- తగ్గనున్న బ్యాగుల భారం
- పాఠ్యపుస్తకాల భారంపై ప్రభుత్వం దృష్టి
- పుస్తకాల సంఖ్య కుదించేందుకు నిర్ణయం
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలులోకి..



కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్కూలు పిల్లల పుస్తకాల బరువు ఇకపై తగ్గనుంది. వీపుపై బ్యాగుల భారాన్ని మోస్తున్న చిన్నారులకు త్వరలో ఊరట లభించనుంది. బడి పిల్లలకు గుది బండలా మారిన బ్యాగుల బరువును తగ్గించడం కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుంది. జనవరిలో విద్యాశాఖపై జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో స్కూల్ పుస్తకాల బరువుపై సంబంధిత అధికారులు మంత్రి నారా లోకేష్ ఎదుట కొత్త ప్రతిపాదనలు ఉంచారు. వీటిపై విద్యాశాఖ ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. వాచకాలు, నోటు పుస్తకాలు, వర్క్ బుక్స్, డైరీలు ఇలా రకరకాల పేర్లతో పిల్లలు తమ శక్తికి మించిన భారాన్ని మోస్తున్నారు. కొంత మంది తల్లిదండ్రులు ఈవిషయాన్ని పెదగా పట్టించుకోకపోయిన, మిగతా వారు తీవ్రంగా పరిగణించి పిల్లలపై భారాన్ని తగ్గించాలని ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. ఈనేపథ్యంలో విద్యార్థుల పుస్తకాలు బ్యాగులపై స్టడీ చేసిన పలు కమిటీలు ప్రభుత్వానికి వివిధ సూచనలు చేశాయి. ఏ తరగతి విద్యార్థులకు ఏ మేరకు పుస్తకాల బ్యాగుల బరువు ఉండాలన్న దానిపై ఒక నివేదికను రూపొందించాయి. ఆ సూచనల ప్రకారం పిల్లల బరువులో వారు మోసే పుస్తకాల బరువు పది నుంచి పదైదు శాతానికి మించకూడదు.

తరగతుల వారీగా చూస్తే.... 1,2 తరగతులకు 1.50 నుంచి 2కిలోలకు మంచి బరువు ఉండకూడదు. 3 నుంచి 5 తరగతులకు రెండు నుంచి మూడు, 6,7,8 తరగతులకు 3 నుంచి 4కిలోలు, 9,10 తరతగతులకు 4 నుంచి 5 కిలోలకు మించి బరువు ఉండకూడదు. విద్యాశాఖ మంత్రి లోకేష్ ఎదుట ఉంచిన ప్రతిపాదనల ప్రకారం ప్రతి సబ్జెక్టుకు ఒక పుస్తకానికి బదులుగా, కొన్ని సబ్జెక్టులు కలిపి ఒకే పుస్తకంగా ముద్రిస్తారు. ప్రాథమిక స్థాయిలో మొత్తం సబ్జెక్టులు ఒకే పుస్తకంలో ఉంటాయి. పై తరగతుల్లో కూడా ప్రస్తుత ఉన్న పుస్తకాలను సగానికి తగ్గించి, రెండు మూడు సబ్జెక్టులు కలిపి ఒకే పుస్తకంగా తెస్తారు.

ఈ ప్రతిపాదనలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని, విమర్శలకు తావు లేకుండా తగిన విధానం రూపొందించి అమలు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ ప్రతిపాదనలు యదావిధిగా అమలైతే ఇకపై పాఠశాల విద్యార్థులపై పుస్తకాల మోత భారం తగ్గనుంది. వచ్చే విద్యా సంవత్సరం ఆరంభానికి ఇంకా రెండు నెలల సమయం ఉన్నందున కొత్త ప్రతిపాదనలు అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గతంలో ఇలా...

ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు విధిగా ప్రభుత్వం ముద్రించిన పాఠ్యపుస్తకాలతోనే విద్యార్థులకు బోధించాలి. స్టేట్, సీబీఎస్ఈ సిలబస్ మినహా ఇతర పాఠ్యాంశాలను బోధించకూడదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఐఐటీ కోచింగ్, స్మార్ట్ క్లాసులు, రివిజన్ టెస్టుల పేరుతో సాధారణ పాఠ్యపుస్తకాలతో పాటు సంస్థల పుస్తకాలను కొనుగోలు చేయాల్సిందిగా తల్లి దండ్రులకు సూచిస్తున్నాయి. దీంతో పాటు అదనంగా రాసిన పుస్తకాలను పాఠశాలలోనే కొనాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయి. బయట కొంటే అవి అనర్హమైనవని సాకులు చెబుతూ తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.

బ్యాగుబరువు అయితే అనర్థాలివే..

విద్యార్థులు అధిక బరువు మోయడం వల్ల నడుం, వెన్ను, కండరాల నొప్పికి గురవుతారు. మానసిక ఆందోళన పెరుగుతుంది. చదువుపై దృష్టిపెట్టలేరు. జీర్ణవ్యవస్థ మందగిస్తుంది. ఆకలి వేయదు. పుస్తకాలను చూడగానే ఆందోళనకు గురవుతారు. పాఠశాలకు వెళ్లే ముందు, వచ్చిన తర్వాత అసహనానికి లోనవుతారు. వీటిని గుర్తించిన విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ నిపుణులతో చర్చించి బ్యాగులు బరువు తగ్గించే విధంగా నిర్ణయం తీసుకున్నారు. సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన పాఠ్యపుస్తకాలను కూడా రూపొందించారు.

మీ సేవలు చిరస్మరణీయం



పదవీ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం పాటు పోలీసుశాఖకు విశేష సేవలందించి పదవీ విరమణ పొందడం అభినందనీయమని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో మార్చి నెలాఖరున పదవీ విర మణ పొందిన కడప వన్‌టౌన్ ఏఎస్ఐలు పి.రాముడు, ఆర్.రాముడు, కడప డీఏఆర్ ఏఆర్ ఎస్ఐ జి.చంద్రశేఖర్‌లను ఎస్పీ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుశాఖలో చేరినప్పటి నుంచి నిరంతరం శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడుతూ పదవీ విరమణ పొందడం అదృష్టమన్నారు. విధి నిర్వహణలో అందించిన సేవలే ఉద్యోగానంతరం గుర్తుండిపోయేలా మంచి పేరుప్రఖ్యాతులు తెస్తాయన్నారు. పదవీ విరమణ పొందిన తరువాత కూడా మీరు పోలీసు కుటుంబంలో సభ్యులేనని, భవిష్యత్తులో ఎలాంటి సహాయం కావాలన్నా పోలీసుశాఖ ఎల్లవేళాల ముందుంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ప్రకాశ్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ రమ ణయ్య, ఆర్ఐలు టైటస్, వీరేశ్, శివరాముడు, డీపీవో ఏవో జ్యోతి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ధూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల దాహార్తి తీర్చేందుకే నీటి తొట్లు



కొండపేటలో పశువుల తొట్టికి శంకుస్థాపన చేస్తున్న డ్వామా పీడీ

చెన్నూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వేసవిలో పశువులు దాహార్తితో ఇబ్బంది పడకుండా నీటి తొట్లు ఏర్పాటు చేసి.. వాటి సంరక్షణకు కృషి చేస్తోందని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి అన్నారు. ఇందులో భాగంగా మండలానికి 9 నీటి తొట్లు మంజూరయ్యాయని తెలిపారు. కొండపేట గ్రామంలో నిర్మించే పశువుల తొట్టికి డ్వామా పీడీ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు 714 పశువుల నీటి తొట్లు మంజూరయ్యాయని, ఒక్కోదాన్ని రూ.33వేలతో నిర్మిస్తోందన్నారు. ఈనెల 10లోగా పూర్తి చేయాలన్నారు. ఆ గ్రామంలో ఉన్న పశువులను బట్టి అవసరమైతే మరో తొట్టి కూడా అదనంగా మంజూరు చేస్తామని తెలిపారు. కాగా, ఈ ఏడాది 80 లక్షల పనిదినాలను ఉపాధి పథకంలో చేపట్టడం జరుగుతుందన్నారు. ఒక్కో కూలీకి వంద రోజుల పనిదినాలు కల్పిస్తామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాలకు మాత్రం 150 రోజులు పనిదినాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లాపశు సంవర్ధకశాఖ సంయుక్త అధికారిని శారదమ్మ, ఏపీడీ సోమశేఖరరెడ్డి, ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్, ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు, ఏపీవో శైలజ, ఈవోఆర్‌డీ సురేశ్‌బాబు, పశువైద్యాధికారి ఎర్రపురెడ్డి, సర్పంచ్ తుంగచంద్రయాదవ్, టీడీపీ నేతలు కె.విజయభాస్కర్‌రెడ్డి, శివారెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ ఘర్షణపై డీఎస్పీ ఆరా.. 11 మందిపై కేసు



భూవివాద పొలాలను పరిశీలిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

బహ్మంగారిమఠం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలంలోని మద్దిరెడ్డిపల్లెలో సోమవారం దాయాదులైన ఇరువర్గాల వారు భూ సమస్యతో ఘర్షణకు దిగగా ఒకరు మృతి చెందగా.. పలువురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ విషయంపై మంగళవారం మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, రూరల్ సీఐ శివశంకర్ యాదవ్, ట్రైనీ డీఎస్పీ భవానీ వివాదాస్పద భూముల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఘర్షణకు దారి తీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ఘర్షణ సందర్భంగా దహనమైన ద్విచక్ర వాహనాలను పరిశీలించారు. అనంతరం మృతి చెందిన పెసల నారా యణ రెడ్డి కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి భూతగాదాకు కారణమైన పరిస్థి తులను విచారించారు. ఘర్షణకు సంబంధించి 11 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ విచారణలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌రెడ్డికి రాజకీయ సమాధి కడతాం

- ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కడప మారుతీనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని సంవత్స రాలుగా ఎస్సీ వర్గీకరణ విషయంలో స్పష్టమైన వైఖరి వెల్లడించ కుండా... మాదిగల అభివృద్ధికి శకునిలా అడ్డుపడిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి రాజకీయ సమాధి కడతామని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి డి.రామకృష్ణ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్నప్పటికీ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో సైతం కనీసం ఒక్క న్యాయవాదిని కూడా నియమించకుండా మాదిగ, మాదిగ ఉప కులాల ప్రజల భవిష్యత్‌ను నాశనం చేశారని ధ్వజమెత్తారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ కోసం ముందు నుంచి సానుకూలంగా వున్నా రన్నారు. ఆ కోవలో ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమో దింపచేయడం పట్ల సంతో షం వ్యక్తం చేశారు. సమావేశంలో సమితి జిల్లా అధ్యక్షుడు మానికింది వెంక టేష్, ఎంఎస్‌పీ అధికార ప్రతినిధి మాతయ్య, నాయకులు శివయ్య, నరసిం హ, ఓబయ్య, భాస్కర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు

- భూమిని పరిశీలించిన ఆర్డీవో

సిద్దవటం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టక్కోలి గ్రామ రైతు తన పట్టా భూమిని ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకోగా మంగళవారం కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ పరిశీలించారు. టక్కోలి గ్రామానికి చెందిన దుంపల అశోక్‌రెడ్డి సర్వేనంబరు 429/1, 429/2, 430లో తన పట్టా భూమి 4.80 ఎకరాల్లో అగ్రికల్చర్ గోడౌన్ నిర్మాణం కొరకు ల్యాండ్ కన్వర్షన్ కొరకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు కడప ఆర్డీవో రైతు పట్టా భూమి హద్దులు పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దారు మాధవీలత, ఆర్ఐ శ్రీనివాసులు, మండల సర్వేయర్ నాగభూషణంరెడ్డి, విలేజ్ సర్వేయర్ పవన్‌కుమార్, వీఆర్వో సంటయ్య పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీ

సిద్దవటం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మండలంలోని కడప - చెన్నై జాతీయ రహదారి భాకరాపేట చాముండేశ్వరిపేట, పార్వతీపురం, మాధవరం-3, ఉప్పరపల్లె గ్రామాల్లో నేషనల్ హైవేకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదల్లో తనిఖీ చేశారు. ఈ బ్రహ్మోత్సవాలకు సీఎం చంద్రబాబునాయుడు దంపతులు, మంత్రులు, వీవీపీ అధికారుల పర్యటన ఉన్నందున ఎస్పీ ఆదేశాలతో ఆర్వోపీ సిబ్బంది, పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య



పోరుమామిళ్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెందిన కల్లూరి రామతులసి (25) అనే యువతి ఇంట్లో ఎవరూ లేని సమ యంలో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందింది. పోలీ సుల వివరాల మేర కు.. మండలంలోని తిరువెంగలాపురం గ్రామానికి చెందిన కల్లూరు జయరామిరెడ్డి కుమార్తె తనకు సరైన పెళ్లి సంబంధం రావడం లేదని మనస్తాపం చెంది మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుంది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. మంగళ వారం సాయంత్రం మృతదేహానికి పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

పాత కలెక్టరేట్‌ను పరిశీలించిన కలెక్టర్



పాత కలెక్టరేట్ భవనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం బీసీ భవన్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పాత రిమ్స్, పాత కలెక్టరేట్‌లోని ప్రాంగణాల భవనాలను ఆయన కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ సంబంధిత అధికారులతో కలసి పరిశీలించా రు. ముందుగా పాత రిమ్స్‌లోని ఖాళీ స్థలాలను, నూతనంగా నిర్మి స్తున్న బీసీ వెల్ఫేర్ భవనాన్ని బీసీ సంక్షేమాధికాధికారితో కలిసి మీటింగ్ హాలు, తరగతి గదులు, ఇతర రూములను పరిశీలించారు. బీసీ వెల్ఫేర్ ఫండ్స్ మెయింటెన్స్ తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం పాత కలెక్టరేట్‌లోని ప్రాంగణాలను, గదులను పరిశీలించి అక్కడ పని చేసిన గత అధికారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదే ప్రాంగణంలో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాల వివరాలను అడిగి తెలు సుకున్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి భరత్ కుమార్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి తీరేనా..?

- ఎర్రగుంట్లకు గండికోట తాగునీటి స్కీం
- రూ.109 కోట్లతో టీడీపీ హయాంలో మంజూరు
- ఆ స్కీంను గాలికి వదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- తాజాగా రూ.117 కోట్లతో రివైజ్డ్ డీపీఆర్ తయారీ



పనులు చేపట్టకపోవడంతో గతంలో వచ్చిన పైపులు మార్కెట్‌యార్డులో నిరుపయోగంగా ఉన్న దృశ్యం

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పాలకుల నిర్లక్ష్యంతో ఎర్రగుంట్ల ప్రజలకు తాగునీటి కష్టాలు తీరడం లేదు. ఎర్రగుంట్ల ప్రజల దాహార్తి తీర్చేందుకు 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.109 కోట్లతో గండికోట నుంచి తాగునీటి స్కీం టెండర్లు పిలి చారు. రెండు ఫేజ్‌లుగా పనిని విభజించి కేటాయించారు. పనులు నిర్వహించేందుకు పైపులు కూడా సరఫరా చేశారు. అనంతరం అధికారం మారింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ పనులను పట్టించుకోలేదు. కేవలం కమీషన్లకు కక్కుర్తిపడి పనులను అడ్డుకున్నార న్న విమర్శలున్నాయి. దీంతో ఎర్రగుంట్ల వాసులకు ఇప్పటికీ తాగు నీటి సమస్య అలాగే ఉంది. దీంతో ఇక్కడి ప్రజల దాహార్తిని తీర్చేందుకు శాశ్వతమైన పరిష్కారం కోసం తాజాగా రూ.117 కోట్ల తో గండికోట నుంచి తాగునీటి స్కీంకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

అస్తవ్యస్తంగా తాగునీటి సరఫరా

ఎర్రగుంట్లలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉంది. సరఫరా అయ్యే నీటికి, వీధులకు వెళుతున్న వంతులకు పొంతనే లేదు. నిల్వ చేసేందుకు సరైనన్ని ట్యాంకులు ఇప్పటికీ లేవు. ఉన్నవాటిని మూలన పడేసి, నీటి సరఫరాను కొందరు ఇష్టారాజ్యంగా మార్చేశారు. కొన్ని వీధుల్లో ప్రతిరోజూ, రెండురోజులకో మారు, మరికొన్ని వీధుల్లో 4 రోజులకు, ఇంకొన్ని వీధుల్లో వారానికి, 10 రోజులకో మారు తాగునీరు వదులుతున్నారు. సుమారు 45 వేల జనాభా ఉన్న ఎర్రగుంట్లకు ప్రస్తుతం పెన్నా, కమలాపురం నీటి స్కీంలే దిక్కు. వర్షాలు రాకపోతే ఎండిపోతున్నాయి. దీంతో తీవ్ర సమస్యలొస్తున్నాయి. కోట్లు వెచ్చించి ట్యాంకులు నిర్మించినా, పైపు లైన్లు వేసినా తాగునీటి సమస్య తీరడం లేదు. బోర్లు ఆదుకుంటున్నా విద్యుత్ బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి. గండికోట స్కీం వస్తే కోట్లలో విద్యుత్ బిల్లులు ఆదా అవుతాయి. వాటిని ఇతర అభివృద్ధి పనులకు వాడుకోవచ్చు.

రూ.117 కోట్లతో రివైజ్డ్ ప్రతిపాదన

గతంలో రూ.109 కోట్లతో గండికోట నుంచి ఎర్రగుంట్లకు తాగునీటి స్కీం మంజూరైన సంగతి తెలిసిందే. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ పనులను పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ నిధులతో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సూచన మేరకు ఇటీవల రూ.117.89 కోట్లతో ప్రభుత్వానికి రివైజ్డ్ డీపీఆర్ పంపారు. ఈ మేరకు 8 ఎంఎల్‌డీ సామర్థ్యంతో గండి కోట వద్ద వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు నిర్మిస్తారు. గండికోట నుంచి ఎర్రగుంట్ల వరకు 42 కి.మీ. మెయిన్ పైప్‌లైన్ నిర్మిస్తారు. గ్రావి టీతో నీరు సరఫరా అవుతుంది. అలాగే ఎర్రగుంట్లలో 2350 కిలోలీ టర్ల సామర్థ్యం గల మూడు ట్యాంకులు నిర్మిస్తారు.

జడ్పీ బాలుర హైస్కూల్‌లో 25 సెంట్లలో ఒక ట్యాంకు నిర్మించేందుకు గతంలో ప్రస్తుత ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి శంకుస్థాపన చేశారు. హిందూ శ్మశానవాటికలో ఒకటి, ప్రకాష్ నగర్‌లో మరొకటి నిర్మించేందుకు స్థలాలు ప్రతిపాదించారు. ఎర్రగుంట్లలోని 20 వార్డుల్లో 55 కి.మీ. డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్ నిర్మిస్తారు. పాత కనెక్షన్స్‌కు ఉచితంగా కనెక్షన్లు ఇవ్వనుండగా కొత్తవాటికి నిబంధనల ప్రకారం కనెక్షన్లు ఇస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఈ స్కీం అమల్లోకొస్తే ఎర్రగుంట్లకు రోజూ తాగునీరు సరఫరా చేయవచ్చు. అయితే ఈసారైనా ఈ స్కీం పూర్తి చేసి తమ దాహార్తి తీర్చాలని ఎర్రగుంట్ల ప్రజలు కోరుతున్నారు.

డీపీఆర్ పంపాం

గండికోట నుంచి ఎర్రగుంట్లకు తాగునీటి పైప్‌లైన్‌కు సంబంధించి రివైజ్డ్ స్కీంలో రూ.117.89 కోట్లతో డీపీఆర్ పంపాము. అది మంజూరైతే మూడు నాలుగు నెలల్లో టెండర్లు పిలిచే అవకాశం ఉంది. ఎర్రగుంట్లకు మాత్రమే ఈ స్కీం వర్తిస్తుంది.

- మూర్తి, ఈఈ, పీహెచ్

విజయదుర్గాదేవి సన్నిధిలో రాహుకాల పూజలు



కడప కల్చరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నగర బిల్టప్ సమీపంలో వెలసిన విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం ఘనంగా రాహుకాల పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరైన అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 వరకు దీపాలను వెలిగించారు.

చిన్నపిల్లలపై అత్యాచారాలకు పాల్పడితే పోక్సోయాక్టు కింద కఠిన చర్యలు

జూనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న జడ్జి చంద్రశేఖర్‌రెడ్డి

పులివెందుల టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లలపై అత్యాచారాలకు పాల్పడితే పోక్సోయాక్టు కింద కఠిన చర్యలుతీసుకుంటామని పులివెందుల జూనియర్ సివిల్ జడ్జి ఎం.చంద్రశేఖర రెడ్డి అన్నారు. పట్టణ పరిధిలోని ప్రభుత్వ గిరిజన సమీకృత బాలికల వసతిగృహం హాస్టల్‌లో మంగళవారం మధ్యాహ్నం పులివెందుల మండల లీగల్ సర్వీసు కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమస్యలుంటే 1500 లేదా 100కు ఫోను చేసినా తక్షణమే పోలీసులు వచ్చి రక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ కిశోర్‌కుమార్‌రెడ్డి, ప్రకాశ్,కళావతి విద్యార్థులు పాల్గొన్నారు.

భర్త పింఛన్ భార్యకు పంపిణీ



పింఛన్ పంపిణీ చేస్తున్న షబ్బీర్

వేంపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): భర్త మృతిచెందడంతో ఆయన భార్యకు పింఛన్ మంజూరు చేయించి వెంటనే పంపిణీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని టీడీపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్ తెలిపారు. వేంపల్లెలోని పుల్లయ్యతోటలో ఫిబ్రవరి నెలలో వృద్ధాప్య పింఛన్ పొందుతున్న మేకల సుబ్బయ్య అనారోగ్యంతో చనిపోయారు. ఆ వెంటనే పింఛన్‌కు దరఖాస్తు చేయించి సుబ్బయ్య భార్య మేకల లక్ష్మీదేవికి బుధవారం పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేయించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం చేయాలని హిజ్రాల ఆందోళన



స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్నహిజ్రాలు

కడప క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సాటి హిజ్రాకు మోసం చేసిన కడప నగరం అశోక్‌నగర్‌కు చెందిన యువకుడిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వన్‌టౌన్ పోలీసుస్టేషను వద్ద పలువురు హిజ్రాలు మంగళవారం ఆందోళన నిర్వహించారు. ప్రేమ పేరుతో వాడుకుని పెళ్లి చేసుకుంటానని చెప్పి ఇప్పుడు హిజ్రా ఆరోగ్యం బాగా లేదని మోసం చేశాడని, దీనిపై న్యాయం చేయాలని ఆందోళనలో డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగేంత వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. ఈ ఆందోళనపై స్పందించిన కడప వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బాధితురాలికి న్యాయం జరిగేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఫిర్యాదు చేసిన హిజ్రాలతో పాటు యువకుడిని పిలిపించి సీఐ మాట్లాడారు. సమస్య సద్దుమణగడంతో వారు ఆందోళన విరమించారు.

ఘనంగా అవధూతేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు

కడప కల్చరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని పాతబస్టాండు వద్ద ఉన్న అవధూతేంద్రస్వామి జ్ఞానమందిరనం 47వ ఆరాధన మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ అవధూతేంద్రస్వామి జ్ఞానమందిర కమిటీ అధ్యక్షుడు జీవీ రమణ, కార్యదర్శి పయ్యావుల వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఆరాధన మహోత్సవాలు వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, తదుపరి ఉదయం5గంటల నుంచి భక్తులకుస్వామివారిని సర్వదర్శనంగావించారు. అనంతరం ఫైర్ ఆఫీసు పక్కన ఉన్న బృందావనం నుంచి స్వామివారి పూర్ణకుంభ కలశ మంగళవాయిద్యాలతో బాణసంచా, ఊరేగింపుతో స్వామివారి మందిరానికి చేరుకున్నారు. అనంతరం ఉదయం 11గంల నుంచి ఆలయం వద్ద స్వామివారి భక్తులకు పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ గావించారు. స్వామివారి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కోనాయపల్లె చెరువుకు మరమ్మతులు జరిగేనా..?

● ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆయకట్టుదారులు ● పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు





కోనాయపల్లె చెరువు, నీరు లీకేజీ అవుతున్న గేటు

పెండ్లిమర్రి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని కోనాయపల్లె గ్రామ సమీపంలో ఉన్న చెరువు క్రింద 88 ఎకరాలు ఆయకట్టు భూమి ఉంది.వర్షాకాలంలో చెరువు నిండితే ఆయకట్టు రైతులు రెండు పంటలను పండించు కోవచ్చు అనే ఆశతో ఎదురు చూస్తూ ఉంటారు.అయితే ఒక పంటకే చెరువులో ఉండే నీరు వృథాగా లీకేజీ రూపంలో వంక లేకి పోతోంది. గడచిన ఐదు సంవత్సరాల కాలంలో చెరువు పూడికతీత పనులుకానీ,మరమ్మతులు కూడా చేయించిన పాపాన పోలేదు.చెరువుకు ఉన్న గేటును బిగించినా కూడా గేటు క్రింద నుంచి నీరు వృథాగా వంకలోకి వెళుతోంది.అలాగే చెరువు కట్ట వెంబడి ముళ్ల పొదలు అల్లుకొని ఉన్నాయి.చెరువులో పూడికతీత పనులు జరిగితే ఎక్కువ నీటిని నిలువ చేసుకో వచ్చు.ఈ లీకేజీని అరికట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.లీకేజీని అరికడితే రెండు పంటలను సాగుచేసుకోవచ్చని రైతులు చెబుతున్నారు.

మరమ్మతులకు అంచనాలను వేసి పంపాం

చెరువు మరమ్మతులకు అంచనాలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపాం. గేటు లీకేజీ మాట వాస్తవమేనని రైతులు అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. ఉత్తర్వులు వచ్చిన వెంటనే పనులు మొదలు పెడతాం.

శామ్యూల్, ఏఈ

నేటి నుంచి సీతారామలక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠ

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని కీర్తిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయంలో బుధవారం నుంచి 4వ తేదీ వరకు శ్రీసీతారామలక్ష్మణ సమేత హనుమ విగ్రహ ప్రతిష్ఠమహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఆయా రోజుల్లో కోలాటం, గ్రామోత్సవం, ఆర్కెస్ట్రా, కచేరి పోటీలు ఉంటాయన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు.

నేడు మంచినీటి సరఫరాకు అంతరాయం

కడప(వినాయకనగర్), ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ దగ్గర బళ్లారి రోడ్డులో ప్రధాన పైపులైన్ లీకేజీ కావడంతో బుధవారం మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగర కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో సాయిపేట, ఆగాడిఏరియా, అక్కాయపల్లి, చెమ్మమియ్యాపేట, రవీంద్రనగర్, నబీకోట, దుర్గమ్మ కాలనీ, లోహియా నగర్ తదితర ప్రాంతాలకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు మంచినీటిని దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలోనే మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరాను అందిస్తామన్నారు.

నేడు ఉర్దూ కవి సమ్మేళనం

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బజ్మెజకి,అమీరున్నీసా విద్యాసంస్థలు సంయుక్తంగా బుధవారం సాయంత్రం రవీంద్రనగర్‌లోని యూఎస్ కల్యాణ మండపంలో చేపట్టనున్న జాతీయ ఉర్దూకవి సమ్మేళనం, ఉర్దూ కవి సయ్యద్ నజర్ పుస్తక ఆవిష్కరణను జయప్రదం చేయాలని అఫ్జల్ ఖాన్ కోరారు. మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమంలో 16 మంది ఉర్దూ కవులతో పాటు వివిధ రాష్ట్రాల ప్రముఖ ఉర్దూ కవులు పాల్గొంటారు. ఈకార్యక్రమంలో కవులు, సాహితీ ప్రియులు, ఉపాధ్యాయులు పాల్గొని విజయ వంతం చేయాలన్నారు.

పశువుల నీటితొట్లు మంజూరు

పెండ్లిమర్రి,ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె గ్రామ పంచాయతీకి ఉపాధిహామీ పథకం నిధుల క్రింద నాలుగు పశువుల నీటితొట్లు మంజూరు అయినాయని ఏపీఓ ఓబులమ్మ,సర్పంచ్ గంగిరెడ్డిలు తెలిపారు.మంగళవారం చర్లోపల్లె గ్రామంలో నీటితొట్టి ఏర్పాటుకు భూమి పూజ చేశారు. పగడాలపల్లెకు ఒకటి, వెయ్యినూతులకోనలో రెండు ప్రస్తుతం ఉన్నాయని,మరో రెండింటికి ప్రతిపాదనలు పంపినట్లు ఏపీఓ తెలిపారు.

డ్రైడేపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

వేముల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): డ్రైడే కార్యక్రమంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య అన్నారు. మంగళవారం మండలంలోని వేల్పుల గ్రామంలో ఫ్రైడే డ్రైడేపై అవగాహన కార్యక్రమం కల్పించారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ వీణాకుమారి, ఆరోగ్య కార్యకర్త నాగేశ్వరి,ఆశాకార్యకర్త లక్ష్మీదేవమ్మ పాల్గొన్నారు.

స్వచ్ఛతకు నోచుకోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయ భవనం అపరిశుభ్రతకు నిలయంగా మారింది. ఆరు సంవత్సరాలుగా అపరిశుభ్రంగా మారిందని పరిశుభ్రతకు నోచుకోకపోవడంతో చుట్టుపక్కల ఉండే గ్రామస్థులు ఇక్కడ విషపురుగులు సంచరిస్తున్నాయని పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయం భవనం ప్రాంగణంలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి కనిపిస్తున్నాయని, ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది కూడాఉన్నారో లేదో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి అపరిశుభ్రంగా ఉన్న బీఎస్ఎన్ఎల్ కార్యాలయ భవనం చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని కోరుతున్నారు.



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం

తాగునీటి సమస్య లేకుండా చూడండి : మునిసిపల్ కమిషనర్

పులివెందుల టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో తాగునీటి సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కరించాలని మున్సిపల్ కమిషనరు రాముడు సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక మారుతీహాలు వీధిలో నీటి సరఫరా సమస్య ఉందని తెలుసుకుని వెంటనే స్పందించి అక్కడ మోటారును మరమ్మతులు చేయించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలరు లక్ష్మీభార్గవి, మున్సిపల్ డీఈ చిదానంద రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కుందేళ్ల పార్వేట



లింగాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): లింగాలలో మంగళవారం కుందేళ్ల పార్వేటను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఉగాది పండుగ పార్నరోజున కుందేళ్ల పార్వేట నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉగాది పండుగ రోజు గ్రామంలోని యువకులు కొండకు వెళ్లి కుందేళ్లను పట్టుకొని వస్తారు. పార్నరోజున రామాలయం నుండి సీతారామ లక్ష్మణ విగ్రహాలు పొలంలోకి తీసుకువచ్చి భజనచేసిన అనంతరం కుందేళ్లను పొలంలో విడిచిపెడతారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

7,8 తేదీల్లో నూజివీడులో మహాధర్నా

వేంపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో పనిచేస్తున్న తాత్కాలిక అధ్యాపకులు పనికి సమాన వేతనం కోరుతూ మహాధర్నాకు సిద్ధమవుతున్నారు. తాత్కాలిక అధ్యాపకుల అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ ఆధ్వర్యంలో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో మహాధర్నాకు సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు. ఈ నెల 7,8 తేదీల్లో నూజివీడు ట్రిపుల్‌ఐటీ వద్ద మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతపై జగన్ తన వైఖరిని స్పష్టం చేయాలి

వేముల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన వైఖరిని స్పష్టం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వెంకటశివ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్డీఏ ప్రభుత్వం మెజారిటీ ఉన్న అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుపెట్టి ఆమోదించిందని, వైసీపీ ఆధిక్యం ఉన్న శాసనమండలిలో వర్గీకరణ బిల్లు పెట్టకుండా, మద్దతు ఇవ్వకుండా ఎస్సీ వర్గీకరణ పట్ల మరోమారు జగన్‌మోహన్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని అర్థమవుతోందని దుయ్యబట్టారు.

జిల్లాలో వాహన తనిఖీలు



కడప క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ ఆదేశాలతో మంగళవారం సాయంత్రం జిల్లాలో విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పోలీసు అధికారులు వాహనాల తనిఖీలు చేపట్టారు. అనుమానితులను విచారించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనాల తనిఖీలు చేపట్టి రోడ్డుభద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే కారు డ్రైవర్లు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. సెల్‌ఫోను డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్‌లకు దూరంగా ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో తరలిస్తే చర్యలు తప్పవన్నారు.భద్రత నియమాల ఉల్లంఘనలపై పోలీసులు చర్యలు చేపట్టారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ : కేసు నమోదు

పులివెందుల టౌన్, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పరిధిలోని ఉలిమెల్ల గ్రామంలో స్థల విషయమై ఇరువర్గాల మధ్య మంగళవారం ఘర్షణ జరిగిందని పట్టణ సీఐ నరసింహులు తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

కిరణ్‌మోహన్‌రావు, ఎంపీడీవో



ముఖాముఖి

చెన్నూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామని ఎక్కడా కూడా గ్రామ పంచాయతీలో నీటి సమస్య ఉందన్న మాట వినబడకుండా చేస్తామని ఎంపీడీవో కిరణ్‌మోహన్ రావు అన్నారు.

ప్రశ్న: వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు

జవాబు: మండలంలో ప్రస్తుతానికి తాగు నీటి సమస్య లేదు. రాబోవు మూడు నెలలు ముందు జాగ్రత్త చర్యగా ఇప్పటి నుంచే అన్ని తాగునీటి పైపులైన్లు తనిఖీ చేస్తున్నాం. మోటార్లు రిపేర్లు వచ్చినా వెంటనే తయారు చేస్తున్నాం.

ప్రశ్న: మండలంలో అభివృద్ధి పనులు ఎలా జరుగుతున్నాయి

జవాబు: మండల వ్యాప్తంగా ఇప్పటికే సిమెంటు రోడ్లు పనులు, గ్రావెల్ రోడ్లు, మేజరు పంచాయతీ చెన్నూరులో డ్రైనేజీ ఏర్పాటు చేయిస్తున్నాం. దాదాపు పనులు పూర్తయ్యాయి. సుమారు 3 కోట్ల మేర అభివృద్ధి పనులు పూర్తి కావచ్చాయి. ఇవన్నీ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టడం జరిగింది.

ప్రశ్న: స్వచ్ఛఆంధ్ర స్వచ్ఛదివస్ కార్యక్రమం ఎలా జరుగుతోంది

జవాబు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. ప్రతి గ్రామ పంచాయతీలో రోజూ ఉదయం 8గంటలకే తడి పొడి చెత్తలను వేర్వేరుగా ప్రజల నుంచి సేకరించి వాటిని ఎస్‌డబ్ల్యూపీసీకి తరలించి అక్కడ చెత్తనంతా ఎరువుగా మార్చి మరలా రైతులకు అందిస్తున్నాం.

ప్రశ్న: ప్రస్తుత వేసవిలో ఉపాధి పనులు ఎప్పుడు చేపడతారు.

జవాబు: ఏప్రిల్ నుంచి ఉపాధి పనులు చేపట్టాం.

ప్రశ్న: గ్రామాల్లో ప్రజలకు పారిశుధ్యంపై ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు

జవాబు: ఇప్పటికే పారిశుధ్యంపై మండల మంతా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. వారంలో ప్రతి రోజూ పంచాయతీలో చెత్తబండ్లను ఇంటి వద్దకే పంపిస్తున్నారు.

నేడు ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఫ్యాప్టో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు పీఆర్సీ, ఐఆర్, డీఏ బకాయిలు విడుదల, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, మెడికల్ బిల్స్ రీయింబర్స్‌మెంట్, కారుణ్య నియామకాలు తదితర సమస్యల పరిష్కా రానికి బుధవారం కడప కలెక్టరేట్ ఎదురు గా మధ్యాహ్నం 3 నుంచి 5 వరకు నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్యవర్గ సభ్యుడు సయ్యద్ ఇక్బాల్ పిలుపునిచ్చారు. మంగళవారం కడప నగరం సంఘం కార్యాలయంలో జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఇలియాస్ బాష అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్ ఆర్. అబ్దుల్లా, నాయకులు ఖాదర్ బాష, రాజశేఖర,నరసింహారావు, సాజిత్, బాలగంగిరెడ్డి తదితరులలు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్యసమావేశం

చెన్నూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) :చెన్నూరు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో జరుగుతుందని ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్ తెలిపారు. ఉదయం 10.30గంటలకు జరిగే సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తప్పక హాజరు కావాలని ఆయన తెలిపారు.

ప్రమాదం జరిగితే కానీ స్పందించరా..?

ఆర్టీసీ బస్టాండు వద్ద ఛిద్రమైన రహదారి ● మరమ్మతులు చేయాలని ప్రజల విన్నపాలు



ఆర్టీసీ బస్టాండు వద్ద ప్రమాదకరంగా ఏర్పడిన గుంత

కమలాపురం రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని కోగటం రోడ్డు గుంతలతో నిండిపోయింది. బస్టాండు పక్కనే ఉన్న ఎంపీపీ స్కూల్ ఆనుకుని ఉన్న డ్రైనేజీ కాల్వ నుంచి నిత్యం మురుగునీరు వచ్చి గుంతల్లో నిలుస్తుంది. కోగటం రోడ్డులోనే మూడు హైస్కూల్స్, ఒక ప్రైమరీ పాఠశాల ఉంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు కోగటం మీదుగా ప్రొద్దుటూరుకు వెళ్లే ప్రయాణికులతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రహదారి గుంతలమయం కావడంతో అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వీధుల్లో ఉన్న డ్రైనేజీ నుంచి మురుగునీరు వచ్చే కల్వర్టు మధ్యలో గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. రాత్రుళ్లు ఈ దారిలో వెళ్లాలన్నా ప్రయాణికులు ఇబ్బందులు పడుతన్నారు. మరమ్మతులు చేపట్టాలని విన్నవించినా ప్రయోజనం లేదని స్థానికులు వాపోతున్నారు. రెండుసార్లు జరిగిన మున్సిపల్‌సమావేశంలో ఎమ్మెల్యే చైతన్యరెడ్డి ఈ గుంతలు పూడ్చాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అయినా స్పందన ఏ మాత్రం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణం గుంతలను పూడ్చడంతో పాటు డ్రైనేజీ కాల్వల్లో పూడిక తీసి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అదే విధంగా ఖాజీపేట రహదారిలో ఉన్న పాగేరు వంక ప్రమాదకరంగా మారింది. పూర్తిగా దెబ్బతింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళన పడుతున్నారు. లోలెవల్ వంతెక కావడంతో వర్షాకాలంలో నీరు ఉధృతంగా పారుతుంది. గతంలో బ్రిడ్జి దెబ్బతినడంతో తాత్కాలిక మరమ్మతుల కోసం మట్టి తోలి వదిలేశారు. ప్రమాదం జరగకముందే శాశ్వత పరిష్కారం చూపించాలని చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలో కల్వర్టు ప్రయాణికులకు ప్రమాదకరంగా మారినా గుంత ఎంపీపీ స్కూలు పక్కనే ఉన్న డ్రైనేజీ కాల్వ నుంచి బయటకు మురికినీరు వచ్చి దుర్వాసన వస్తుందని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనరు పగడాల జగన్నాథ్‌ను వివరణ కోరగా, రెండురోజుల్లో గుంతలు పూడ్చి ప్రయాణికుల ఇబ్బందులు నివారిస్తామని తెలిపారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



మైదుకూరు రూరల్, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి) : బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం మైదుకూరులో జరిగింది. ఈ ఎన్నికల్లో బార్ అసోషియేషన్ అధ్యక్షుడుగా సోమేసుల శివప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా అకు ల వెంకట శివరామ్, సహాయ కార్యదర్శిగా చిలుంగారి కృష్ణమూర్తి, మహిళ కార్యదర్శిగా షేక్ తహసీన్‌బాను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారి ఎంపికపట్ల న్యాయవాదులు ఆర్ శ్రీనివాసులు, జ్వాల నరసింహ్మా, కామనూరు శ్రీనివాసులు, కేనేటి శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు.

సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):సెయిల్ ఆధ్వర్యంలో కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ కోరారు. మంగళవారం పాలిటెక్నిక్ కళాశాల బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంగా అప్పటి కేంద్ర ప్రభుత్వం కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు.

నాడు-నేడుకు నిధుల కష్టాలు

● అర్ధాంతరంగా ఆగిన భవన నిర్మాణాలు ● కొన్ని చోట్ల కనీస వసతులకు నోచుకోని వైనం



ఎర్రగుంట్ల బాలుర ఉన్నపాఠశాలలో అర్ధాంతరంగా ఆగిపోయిన భవనం

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అట్టహాసంగా చేపట్టిన నాడు-నేడు పనులు నిధుల్లేక అర్థాంతరంగా ఆగిపోయి దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఎర్రగుంట్ల నగర పంచాయతీతో పాటు, మండలంలో అనేక పాఠశాలలకు నాడు-నేడు కింద పేజ్1, ఫేజ్2లో నిధులు మంజూరు చేశారు. కాగా ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో 11 గదులతో కూడిన భవనం మంజూరై పది గదులు నిర్మించారు. ఇందుకు సంబందించి రూ1.29 కోట్లు. నిధులు మంజూరు చేశారు. అయితే గదులు పూర్తయి ఇప్పటికే రెండేళ్లు అవుతున్నా సుమారు రూ.38 లక్షల బిల్లులు రావాల్సివుంది. ఒక భవన నిర్మాణం ఆగిపోయింది. అలాగే పెయింటింగ్, కిటికీలు, ఫ్యాన్స్, లైట్లు, స్టెప్స్‌కు గ్రిల్, రైలింగ్, డోర్లు, పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఈ భవనాన్ని ఉపయోగించుకోలేకపోతున్నారు.

మాజీ సీఎస్ చదివినప్పటికీ: ప్రభుత్వ మాజీ సీఎస్ జవహర్‌రెడ్డి ఇదే పాఠశాలలో చదువుకున్నారు. ఈ భవనం నిర్మాణం సమయంలో ఆయన సీఎస్‌గానే ఉన్నారు. గతంలో నిధులు రాక బిల్డింగ్ ఆగినప్పుడు కలెక్టర్ దృష్టికి వెళ్లగా ఆయన స్పందించి వెంటనే విడుదల చేస్తామని చెప్పారు. అయితే ఇప్పటి వరకు నిధులు రాకపోవడంతో 10గదులు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. నిధులు రాకపోవడం వల్ల సుమారు రూ.కోటి వెచ్చించి నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉంది. దీంతో గదుల్లేక విద్యార్థులు చెట్లకింద చదువుకుంటున్నారు. ఈ గదులు వినియోగలోకి వస్తే ఎంతో ఉపయోగం ఉంటుందని ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు నూతన భవనంలోకి వెళితే..ఇక్కడ స్టాఫ్‌రూం, ల్యాబ్ తదితరం వినియోగంలోకి తెచ్చుకోవచ్చంటున్నారు.

●అలాగే చిలమకూరులోను ఇదే పరిస్థితి.. మండలంలో మరో మేజర్ పాఠశాల అయిన చిలమకూరులో కూడా నిధులు రాక గదులు అర్థాంతరంగా ఆగిపోయాయి. ఇక్కడ 10ప్లస్ కూడా మంజూరు అయ్యింది. అయితే గదుల్లేక ఇక్కడ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.84 లక్షలు మొదట్లో మంజూరు అయ్యాయి. అయితే రూ.36లక్షలు మాత్రమే విడుదల చేయగా నాలుగు రూములు కట్టారు. నిధులు సరిపోకపోవడంతో అవికూడా అర్థాంతరంగా ఆగిపోయాయి. పోట్లదుర్తిలో ఒక భవనం మంజూరైంది. కిటికిలు వాకిళ్లు తదితర వాటికి నిధులు విడుదల కావాల్సివుంది.

భవనాలు లేక ఇబ్బందిగానే ఉంది

పాఠశాలలో విద్యార్థులకు తగిన భవనాల్లేక ఇబ్బందిగా ఉంది. పాఠశాలలో నూతనంగా నిర్మించిన గదులకు త్వరలో నిధులు మంజూరు చేస్తామని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. భవనాలు వస్తే సమస్య ఉండదు.

-రామాంజనేయరెడ్డి, హెచ్ఎం, జడ్పీహైస్కూల్, ఎర్రగుంట్ల

నిధులు రాగానే పూర్తిచేస్తాం

మండలంలో మేజర్‌గా చిలమకూరు జడ్పీ హైస్కూల్‌కు నిధులు మంజూరు కావాల్సి ఉంది. త్వరలో నిధులు మంజూరు అవుతాయి. నిధులు రాగానే పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొస్తాం.

- రామాంజనేయరెడ్డి, ఎస్ఎస్ఏ ఇంజినీర్

ముగిసిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు

● చీఫ్‌లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లపై డిప్యూటీ డీఈవో ఆగ్రహం



పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. సోమవారం జరగాల్సిన చివరి పరీక్ష సోషియల్ పరీక్షను రంజాన్ పండుగను పురష్కరించుకుని మంగళవారం నిర్వహించారు. ఉదయం 9 నుంచి 12.45 గంటల వరకు పరీక్ష జరిగింది. డివిజన్ పరిధిలోని 18 మండలాల్లో 75 పరీక్షా కేంద్రాల్లో 12,431 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 67 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే ప్రొద్దుటూరు మండలంలో 23 పరీక్షా కేంద్రాల్లో 3,758 మంది పరీక్ష రాయగా 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కాగా పరీక్ష చివరి రోజు ఉప విద్యాశాఖాధికారి యు.మీనాక్షి ఏడు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి వివిధ పరీక్షా కేంద్రాల్లో చీఫ్, డిపార్టుమెంటల్ ఆఫీసర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు అన్ని గదులను పరిశీలించకుండా ఒక రూముకే పరిమితమయ్యారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్‌బీ మెమోరియల్ పాఠశాల పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్లు, ఇతర పరీక్షా సిబ్బంది కాఫీ, టీలు తాగుతుండడంతో ఈ పరీక్షా కేంద్రమా, హోటలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పరీక్ష జరుగుతున్నా పాఠశాల వాచ్‌మెన్ పాఠశాలలోనే ఉండడంతో వారిని ఒక గదిలో ఉంచి పరీక్ష పూర్తయిన తర్వాత బయటకు పంపాలని పోలీసులకు సూచించారు. నడింపల్లె మున్సిపల్ హైస్కూలు పరీక్షా కేంద్రంలో చీఫ్, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు ప్రధానోపాధ్యాయులుగా పనికిరారని పరీక్షలకు ఎందుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు రోజులు పరీక్ష జరిగితే ఏ రోజు తనిఖీ చేయలేదు. ఉపవిద్యాశాఖాధికారి చివరి రోజు తనిఖీకి రావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కరువు మండలాల ప్రకటనపై ఎమ్మెల్యేకు ధన్యవాదాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మైదుకూరు రూరల్ ,ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ కృషి అభినందనీయమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో దనపాల జగన్, ఏపీ రవీంద్రతో కలిసి మాట్లాడుతూ మైదుకూరు నియోజక వర్గంలోని మైదుకూరు, చాపాడు, ఖాజీపేట, దువ్వూరు, బ్రహ్మంగారిమఠం మండలాలను రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించడంతో రైతాంగానికి చాలా తోడ్పాటు ఉంటుందన్నారు. పంటలు పండకుండా నష్టపోయిన రైతులకు పరిహారం కూడా వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అన్నవరం సుధాకర్ రెడ్డి, ఆకుల క్రిష్ణయ్య, భామయ్య, బోరెడ్డి రమణారెడ్డి, బండి అమర్‌నాద్, తుపాకుల రమణ పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించడం హర్షణీయం

దువ్వూరులో: దువ్వూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడం హర్షణీయమని మండల టీడీపీ కన్వీనర్ బోరెడ్డి వెంకటరమణారెడ్డి తెలిపారు. రైతులు సరైన దిగుబడులు అందక ఇబ్బందులు పడ్డారని రాష్ట్ర ప్రభుత్వం రైతుల పరిస్థితిని అర్థం చేసుకోవడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు భాస్కర్‌రెడ్డి, రామలక్ష్మిరెడ్డి, చిన్నకృష్ణయాదవ్, ఖదీర్‌బాష, లక్షుమయ్య యాదవ్ పాల్గొన్నారు.



తల్లిదండ్రులను కోల్పోయి పుట్టెడు దుఃఖంలోను టెన్త్ పరీక్షలకు హాజరైన విద్యార్థి

కొండాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను కోల్పోయి మూడు రోజులు కాకముందే పుట్టెడు దుఖంలోను బాధను దిగమింగుతూ ఓ విద్యార్థి మంగళవారం పదో తరగతి పరీక్షలకు హాజరయ్యాడు. స్థానిక వివేకానంద పాఠశాలలో చదువుతున్న తూర్పింటి జశ్వంత్ తల్లిదండ్రులు రామమోహన్, సరోజలు శనివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఆదివారం వారికి అంత్యక్రియలు జరిగాయి. తల్లిదండ్రులు చనిపోయి మూడురోజులు కాకముందే బాధను దిగమింగుతూ మంగళవారం జరిగిన పదో తరగతి సోషల్ స్టడీస్ పరీక్షకు హాజరయ్యాడు జశ్వంత్. నీకు తోడూగా మేమున్నామని , బాధపడవద్దని , ధైర్యంగా పరీక్ష రాయాలని పాఠశాల కరస్పాండెంట్ బి.లింగేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు ధైర్యం చెప్పి పరీక్షకు పంపారు. పరీక్షా కేంద్రం వద్ద బాధపడుతున్న జశ్వంత్‌ను అయ్యోపాపం అంటూ పలువురు ఓదార్చారు. ఆ విద్యార్థి తల్లిదండ్రులను కోల్పోయి బాధను దిగమింగుతూ పరీక్షను రాసిన సంఘటన అందరిని కలిచివేసింది.

రైతుసేవా కేంద్రాల తనిఖీ

ముద్దనూరు ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి):మండలంలోని రైతు సేవా కేంద్రాలను మంగళవారం వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి తనిఖీ చేశారు. అందులో భాగంగా ఆయన ముద్దనూరు-2, తిమ్మాపురం రైతు సేవాకేంద్రాలను తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. రైతు విశిష్టగుర్తింపు రిజిస్ట్రేషన్‌కు పెండింగ్‌లో ఉన్న రైతులకు విరించి రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. ఇప్పటి వరకు 69 శాతం మాత్రమే రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని, వందశాతం పూర్తి చేయాలన్నారు. వేసవిలో సాగు చేసిన పంటలను నమోదు చేసుకోవాలన్నారు. ఆర్ఎస్‌కే సిబ్బంది నిహారిక, జ్యోతి ఉన్నారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసునమోదు

కాశినాయన ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కోడిగుడ్లపాడు గ్రామానికి చెందిన శీలం వెంకటరెడ్డిపై మంగళవారం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. కేఎస్ కొట్టాల గ్రామానికి చెందిన మరియరాణి, చిన్నయ్యలు పశువులు మేపుకొనుటకు పొలాలకు వెళ్లగా వారి పశువులు వెంకటరెడ్డి పంటచేలో పడ్డాయని.కోపంతో వారిపై గొడ్డలి కర్రతో దాడిచేశాడు. ఈక్రమంలో చిన్నయ్యకు గాయాలయ్యాయి. వారి ఇరువురి ఫిర్యాదు మేరకు వెంకటరెడ్డిపై కేసు నమోదు చేశామన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జమ్మలమడుగు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఉన్న సమస్యలు ఉన్నతాధికారులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని రైల్వేస్టేషన్ కన్సల్టెన్సీ కమిటీ మెంబర్ సిలిరివేరి వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం సమస్యలపై రైల్వే కేంద్ర భవన్ నిర్మాణ శాఖ ఛైర్మన్ వి.శ్రీనివాసులు నాయుడుకు వినతి పత్రం అందించినట్లు ఆయన తెలిపారు. ఆయన ద్వారా సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాదు జీఎం కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందజేస్తానని ఆయన చెప్పినట్లు తెలిపారు. ప్రయాణికుల రక్షణ కోసం ఆర్‌పీఎఫ్ ఉద్యోగులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కాంతినగర్ ఎర్రగుంట్ల చెందిన మోరం ప్రసాద్ రెడ్డి(26) కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ చ మంగళవారం రాత్రి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మాత్రలు అధికంగా వేసు కోవడం వల్ల మార్చి 29న అస్వస్థకు గురైయ్యాడు. చికిత్స కోవసం ఆయన్ను కడప రిమ్స్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మార్కెట్ గెజిట్ ప్రకారం రుసుం చెల్లించాల్సిందే

● పాత బస్టాండ్ వ్యాపారులకు స్పష్టం చేసిన కమిషనర్



వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్

ప్రొద్దుటూరు,ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ విడుదల చేసిన కూరగాయల మార్కెట్ గెజిట్ ప్రకారం పాతబస్టాండ్ వద్ద తోపుడు బండ్లు ఇతర దుకాణాలు పెట్టుకున్న వారంతా రోజుకు 25 రూపాయలు చెల్లించాల్సిందేనని కమిషనర్ మల్లికార్జున స్ప ష్టం చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వ్యాపా రులతో మాట్లాడుతూ మార్కెట్ గెజిట్ ప్రకారం ఏఏ ప్రాంతాలలో రుసుం చెల్లించాలో స్పష్టంగా పొందుపరిచారన్నారు. మున్సిపాలిటీకి ఆదాయం వస్తే నే కదా ప్రొద్దుటూరు పట్టణ ప్రజలకు అన్ని సౌకర్యాలు మెరుగుపరచగల మన్నారు. ఇందుకు వ్యాపారులు మాట్లాడుతూ తామం తా పేదలమని ఎస్సీ, ఎస్టీలమని ప్రతిరోజు మార్కెట్ రుసుం చెల్లించలే మన్నారు. గతంలో ఎప్పుడూ ఏ ఎమ్మెల్యే ఏ అధికారి గానీ మానుంచి రుసుం వసూళ్లు చేయలే దని ఇప్పుడు మీరు కొత్తగా అమలు చేస్తే మేమే మున్సిపల్ కార్యాలయం వద్దే బండ్లు పెట్టుకొని ధర్నాలు చేస్తామన్నారు. అయితే పాత బస్టాండ్ వద్ద ఉన్న మున్సిపల్ స్థలాలు ఖాళీ చేయాలని మీకంతా ఆరవేటి సినిమా హాలు వెనుక మున్సిపల్ స్థలం ఉచితంగా ఇస్తామని అక్కడికి వెళ్లి వ్యాపారాలు చేసుకోవచ్చన్నారు. దీంతో మేము ఎక్కడి వెళ్లమని రుసుం చెల్లించమని పాతబస్టాండ్ వద్దనే వ్యాపారం చేసుకుంటామని చెప్పి వెళ్లిపోయారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ ఆచారి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద ఏప్రిల్ 7 న సీఎండీ కార్యాలయం వద్ద జరిగే కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా ను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ఎన్నికల పాదయాత్రలో భాగంగా నారా లోకేశ్ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పైపులైను మరమ్మతుల కోసం నీటి సరఫరా నిలిపివేత

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణానికి మైలవరం జలాశయం నుంచి వచ్చే తాగునీటి పైపులైనుకు జమ్మలమడుగు రైల్వే స్టేషను దగ్గర లీకేజీ రావడంతో మరమ్మతుల కోసం నీటి సరఫరా నిలిపివేయాల్సి వస్తోందని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేది వరకు మైలవరం నుంచి ప్రొద్దుటూరు ట్రీట్‌మెంట్ ప్లాంటుకు నీటి సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు. అందువల్ల మూడు రోజుల పాటు పట్టణంలో నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతుందని కమిషనర్ తెలిపారు. రోజుమార్చి రోజు నీటి సరఫరా చేస్తామన్నారు. ఈ విషయం పట్టణ ప్రజలు గమనించి నీటిని పొదుపుగా మూడు రోజుల పాటు వినియోగించుకోవాలని కమిషనర్ తెలిపారు.

పశువుల దాహార్తి తీర్చడానికి నీటి తొట్లు మంజూరు

అట్లూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు పశువులకు వేసవిలో దాహార్తి తీర్చడానికి నీటి తొట్లు మంజూరైనట్లు ఎంపీడీవో భాస్కర్‌బాబు తెలిపారు. ఉపాధి హామీ నిధులతో నీటి తొట్లను ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఊరి చివర పశువుల పాకల వద్ద నిర్మించడం జరుగుతుందని ఆయన తెలిపారు. నీటి తొట్టిని రూ.2వేలతో నిర్మిస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డయ్య ఈశ్వర్‌రెడ్డి, పెంచలయ్య, నరసింహులు, సుధాకర్‌రెడ్డి, అయ్యవార య్య అధికారులు ఏపీవో జయచంద్ర, ఈసీ సుధాకర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజల్లో చైతన్యంరావాలి

రాజుపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సైబర్ నేరాలపై ప్రజల్లో చైతన్యం రావాలని రాజుపాలెం ఎస్ఐ కత్తి వెంకటరమణ సూచించారు. మంగళవారం వెలవలి గ్రామంలో సైబర్, ఫ్యాక్షన్, అసాంఘిక కార్యకలాపాలపై గ్రామ ప్రజలతో అవగాహన కల్పించారు. పొలాల వద్ద గెట్లు, ఇతర భూ సమస్యలపై రైతులు తగాదా పడకుండా సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. తగాదాల వల్ల కేసు నమోదై కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడపాలని సూచించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేయరాదన్నారు.

నేడు మంత్రి సత్యకుమార్ పర్యటన



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ప్రొద్దుటూరు అర్బన్ ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆరోగ్యశాఖ శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం జిల్లాలో పర్యటించి పలు కార్యక్రమాలలో పాల్గొంటారని ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు వంకదార నరేంద్ర తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కడప పట్టణంలోని ఏపీ హరిత టూరిజం హోటల్‌లో కడప జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా జంగిటి వెంకటసుబ్బారెడ్డి ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి మంత్రి హాజరుకానున్నారని తెలిపారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని కానేపల్లే గ్రామంలో కె3 సచివాలయ సముదాయంతోపాటు బుడ్డాయిపల్లిలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు చెన్నా మోహన్, ముత్యాలు శ్రీశ్రీ, కార్య దర్శులు హరిక్రిష్ణ, చిన్న, పార్టీ సీనియర్ నాయకులు పరమేశ్వరరావు, నారాయణ, మురళి పాల్గొన్నారు.

ఆప్కాస్‌ను రద్దుచేస్తే కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

బద్వేలు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ సంస్థను రద్దు చేస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని బద్వేలు మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ)జిల్లా అధ్యక్షుడు నాగేంద్రబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 6న మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ మంగళవారం పాత మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రదర్శనగా వెళ్లి రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ఏవోకు వినతిపత్రం అందించారు. ఆప్కాస్ సంస్థను రద్దుచేసి ఆస్థానంలో ప్రైవేటు ఏజెన్సీలను ప్రవేశపెడతామని నిర్ణయించడంతో కార్మికులందరిలో తీవ్ర ఆందోళనలు నెలకొన్నాయన్నారు. తిరిగి దళారి వ్యవస్థ రంగంలోకి వస్తే తమ ఉద్యోగాకు భద్రత లేకుండా పోతుందని కావున ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

భూములకు పన్ను కడుతుంటే మావికాదంటారా?



ఈవోకు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

మైదుకూరు రూరల్ ,ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : దాదాపు 80 సంవత్సరాలకు పైగా 1937 నుంచి భూములకు పన్నులు కడుతూ సాగు చేసుకుంటుంటే మావికాదంటే ఎలా అంటూ బాధితులు ఎండోమెంటు ఈవో ప్రసాద్‌రావును ప్రశ్నించారు. ఆ మేరకు మంగళవారం ఈవోకు వారొక వినతిపత్రం అందచేశారు. మైదుకూరులో 1937 నుంచి భూములను తాము సాగు చేసుకొంటు, పన్నులు కడుతున్నామని మా పూర్వీకుల నుంచి మాకు రిజిస్టర్‌లు కూడా ఉన్నాయని వాపోయాలు. ఇటీవల కొందరు మావద్దకు వచ్చి డబ్బులు డిమాండ్ చేశారని అవి ఇవ్వకపోవడంతో అధికారులతో నోటీసులు ఇప్పించి మమ్మల్ని ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. అధికారులను సమాచారం హక్కు చట్టం ద్వారా సమాచారం అడిగినా ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో బాధితులు సుబ్బారావు, ఆకేటి శ్రీను, ఆకేటి సురేష్, గురుప్రసాద్, రాఘ వేంద్రమ్మ, గౌరి, సావిత్రి, సరియూ, కరిమూన్ పాల్గొన్నారు.

స్పందించారు.. మరమ్మతులు చేయించారు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలనో దమ్మనపల్లె గ్రామంలో పైపులైను లీకేజీని అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించడంతో సమస్య పరిష్కారం అయింది. మండలంలోని దమ్మనపల్లె గ్రామంలో కొద్దిరోజులుగా పైపులైను లీక్ కావడ వల్ల నీరు కలుషితమవుతుందని అధికారులు పట్టించుకోలేదని విషయాన్ని మంగళవారం 'పైపులైన్ సరిచేయండి' అని 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో అధికారులు పైపులైనుకు మరమ్మతులు చేయించారు. దీంతో పరిష్కారం కావడంతో గ్రామస్థులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

బద్వేలు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి నాగేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు మంగళవారం ఏఐటీయూసీ బద్వేలు పట్టణ సమితి ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మునెయ్య, ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, సురేష్,పెంచలయ్య పాల్గొన్నారు.

ఫ్యాప్టో నిరసనను జయప్రదం చేయండి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఫ్యాప్టో నిరసనను జయప్రదం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పోరుమామిళ్లలో రీజనల్ కన్వీనరు బీవీ క్రిష్ణారెడ్డి అధ్యక్షతన కార్యకర్త ల సమావేశంలో మాట్లాడుతూ ఓపీఎస్ అమలు తప్ప ఎటువంటి ప్రత్యామ్నాయాన్ని అంగీకరించబోమన్నారు. పీఆర్సీ కమిటి నియమించి 30 శాతం మధ్యంతర భృతి కల్పించాలన్నరు, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలు చేసే విషయంలో తాత్సారం చేయడం సరికాదన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

మైలవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వద్దిరాల సుంకులాంబ పరంజ్యోతి అమ్మవారి తిరునాళ్లను పురష్కరించుకుని మంగళవారం బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీలను టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ప్రారంభించగా రాష్ట్రం నలుమూలల నుంచి సీనియర్స్ ఎడ్లజతలు పోటీల్లో పాల్గొన్నాయి. ఇందులో నంద్యాలజిల్లాకు చెందిన వీఎస్ఎస్ రెడ్డి ఎద్దు మొదటి బహుమతి రూ.40 వేలు సాధించగా రెండవ బహుమతి ప్రకాశం జిల్లా లక్ష్మణ్ రెడ్డి ఎద్దు రూ.30 వేలు, మూడవ బహుమతి మైలవరం మండలం కొత్తపల్లెకు చెందిన సునీల్‌కుమార్‌రెడ్డి కంబైన్డ్ జతకు రూ.20 వేలు బహుమతిని గెలుపొందారు. తలమంచిపట్నం ఎస్ఐ లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూర్యపెద్దిరాజు, కొండయ్య, చెన్నకేశవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నీలకంఠారెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

తొమ్మిది మందిపై కేసు నమోదు

ఖాజీపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సోమవారం రాత్రి జరిగిన సంఘటనలో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గత రాత్రి స్కూటర్లలో వచ్చి సౌభాగ్య అనే మహిళపై దాడి చేసేందుకు ప్రయత్నించిన ఓబుళరెడ్డి, సూర్యలతోపాటు మరికొందరిపై ఆమె ఫిర్యాదు చేసిందన్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

